

కాకినాడ భానుగుడి జంక్షన్ వద్ద శ్రీబాల గణపతి భక్త బృందం బెల్లంతో రూపొందించిన వినాయకుని విగ్రహం

వినాయక పూజకు వేళాయె..

» నేటి నుంచి నవరాత్రి మహోత్సవాలు » కొలువుదీరిన గణనాథులు » వీధివీధినా మండపాలు » మార్కెట్లకు చవితి సందడి

గణనాయకాయ..
గణదైవతాయ గణాధ్యక్షాయ ధీమహి..
గుణ శరీరాయ గుణమండితాయ
గుణేశానాయ ధీమహి
గుణాతీతాయ గుణాధీశాయ
గుణప్రవిష్టాయ ధీమహి..

అంటూ ఆ గణనాథుడిని పూజించే సమయం వచ్చేసింది. ఏకదంతాయ, వక్రతుండాయ, గౌరీతనయుడిని భక్తితో కొలిచేందుకు ఊరూవాడా ముస్తాబైంది. గణపతి చవితిని గొప్పగా జరిపేందుకు వీధివీధినా మండపాలు ఏర్పాటయ్యాయి. బుధవారం వినాయక చవితి పండగను పురస్కరించుకుని గణనాథుడిని తమ భక్తి కొలదీ పూజించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. మండపాలలో భారీ వినాయక విగ్రహాల ఏర్పాటు చాలాచోట్ల పూర్తయ్యింది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా బహురూపాల్లో బొజ్జగణపయ్య విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల ప్రాంతం నుంచి శుభముహూర్తంలో ఆ ఆది గణపతి, విఘ్నాలు తొలగించే వినాయకుడు పూజలందుకోనున్నాడు. రాజస్థాన్ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన కొందరు ఈ భారీ విగ్రహాలను విక్రయిస్తున్నారు. అడుగు ఎత్తు ఉన్న ప్రతిమ మొదలు సుమారు 20 అడుగుల ఎత్తు వరకు ఉన్న పెద్దపెద్ద విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ఎంతో ఉత్సాహంగా గణపతి నవరాత్ర మహోత్సవాలను ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని వీధివీధినా బొజ్జగణపయ్యలు కొలువుదీరారు.

శుక్లాంబర'ధర'ం..

ఏ శుభకార్యం తలపెట్టాలన్నా ముందుగా ఆ గణనాథుడి ఆశీస్సులతోనే ప్రారంభించాలి. అంతటి ప్రాధాన్యమున్న లంబోదరుడి చవితి సందర్భంగా మార్కెట్లు కళకళలాడుతున్నాయి. పూజా సామగ్రి, పూలు, పండ్లు, పత్రి విక్రయాలతో చవితి సందడి నెలకొంది. ఏటా మాదిరిగానే పూల ధరలు రుసరుసలాడితే బత్తాయి, యాపిల్ పండ్లల, మొక్కజొన్నపొత్తుల ధరలు ఆకాశాన్నంటాయి. ఓ మాదిరి యాపిల్స్ రూ.వందకు రెండు నుంచి మూడు కాయలు, బత్తాయిలు రూ.వందకు మూడు నుంచి నాలుగు కాయలు విక్రయించారు. మామిడాకులు ఇతరత్రా పత్రి ధరలూ అధికంగానే ఉన్నాయి. కొబ్బరికాయ రూ.30-40, డజను అరటిపండ్లు రూ.50 నుంచి 80(సైజును బట్టి) అమ్మారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని మార్కెట్ సెంటర్లలోనూ చవితి సందడి కనిపించింది. కాకినాడలోని ప్రముఖ జంక్షన్లు, పెద్దమార్కెట్, చిన్నమార్కెట్, రైతు బజార్ల వద్ద, ప్రముఖ జంక్షన్లలోనూ వ్యాపారులు పెద్దఎత్తున పండ్లు, పూలు, పత్రి విక్రయించారు.

బహురూపాల్లో భారీకాయుడు..

వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీలు భక్తులను ఆకట్టుకునేలా బహురూపాల్లో బొజ్జ గణపతులను కొలువుదీర్చారు. కాకినాడ- యానాం రోడ్డులోని జగన్నాథపురం నేతాజీ పార్కు వద్ద సిద్ధి వినాయక విశాఖ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జెమ్స్ చాక్లెట్లతో వినాయక విగ్రహాన్ని రూపొందించారు. సుమారు 16 అడుగుల ఎత్తులో ఉన్న ఈ విగ్రహాన్ని తయారు చేసేందుకు సుమారు వేయి కిలోల చాకెట్లను వినియోగించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ఏటా నగరంలోని పెద్దమార్కెట్ సమీపంలోని సాయిబాబా గుడి వద్ద ఉల్లింకవారి వీధిలో 18 అడుగుల ఎత్తులో వేరుశెనగ కాయలతో వినాయకుడి విగ్రహం సిద్ధం చేశారు. ఇందుకోసం 350 కిలోల వేరుశెనగకాయలను వినియోగించారు. భానుగుడి సమీపంలో కొండయ్య పాలెంలో ఒక టన్ను బెల్లంతో విగ్రహం, 18 అడుగుల గాజుల భారీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు.

'మట్టి' మేలు తలపెట్టు..

పర్యావరణానికి ఎటువంటి ప్రమాదం కలిగించకుండా వినాయక మట్టి ప్రతిమల కొనుగోలుకు జనం ప్రాధాన్యమిచ్చారు. ఇళ్లల్లో పూజలు చేసేవారు వాటి కొనుగోలుకే ఆసక్తి చూపారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు పెద్దఎత్తున మట్టి విగ్రహాల పంపిణీ చేపట్టాయి. పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని సూచించాయి.

- ఆంధ్రజ్యోతి/కాకినాడ



కాకినాడ పెద్దమార్కెట్ సాయిబాబా గుడి సమీపంలోని ఉల్లింకలవారి వీధిలో 350 కిలోల వేరుశెనగకాయలతో ఏర్పాటుచేసిన 18 అడుగుల గణపయ్య విగ్రహం



కాకినాడ మార్కెట్ వద్ద చవితి సందర్భంగా పత్రి, పూజా సామగ్రి విక్రయాలు

కూటమి ప్రభుత్వం వరాల జోష్

వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీలు, యువతలో కూటమి ప్రభుత్వ నిర్ణయం జోష్ నింపింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో వినాయక మండపాలు, చవితి పందిర్లు, మైకులు ఏర్పాటు ఇతర కార్యక్రమాల నిర్వహణకు చలాన్లు కట్టి అనుమతులు తీసుకోవాల్సి వచ్చేది. ఈసారి అలా కాకుండా ఒక్క పైసా చెల్లించకుండానే అన్ని రకాల అనుమతులను ఆన్‌లైన్ ద్వారానే మంజూరు చేస్తున్నారు. అదే సమయంలో మంత్రి నారా లోకేశ్ చొరవతో వినాయక మండపాలు, చవితి పందిర్లకు ఉత్సవాలు జరిగే అన్ని రోజుల్లో ఉచితంగా కరెంటు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో నిర్వాహకులకు ఆర్థిక భారం తగ్గింది.

తప్పని వర్షం

వినాయక చవితి ముందు రోజు వర్షం కురవడం ఆనవాయితీగా వస్తోంది. గత ఏడాది ఇదే మాదిరిగా భారీ వర్షం కురిసింది. ఈ ఏడాదీ అదే రీతిలో మంగళవారం ఉదయం వర్షం ప్రారంభమైంది. రాత్రి వరకు వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమైన ఉత్సవ కమిటీలకు, మార్కెట్‌లో సామాన్లు కొనుగోలు చేసే వారికి ఇబ్బంది తప్పలేదు. .

- ఆంధ్రజ్యోతి/పిఠాపురం



కాకినాడ సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

వినాయక నిమజ్జన ప్రాంతాల పరిశీలన

కాకినాడక్రైం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యారావుపేట బీచ్‌లో గణపతి నిమజ్జన ప్రాంతాలను ఎస్పీ జి.బిందుమాధవ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వినాయక శోభయాత్ర, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రాంతాలను పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించామన్నారు. ఊరేగింపులు క్రమబద్ధంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు, పోర్ట్ సీఐ పి.సునీల్‌కుమార్, ట్రాఫిక్-1 సీఐ ఎన్.రమేష్, ట్రాఫిక్-2 సీఐ డి. రామారావు, మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.



తీగ లాగితే.. డ్రగ్స్ లింకులు!

రాష్ట్రంలో ఎక్కడ పట్టుబడినా మూలాలు ఇక్కడే

» గంజాయి, డ్రగ్స్‌కు కేరాఫ్‌గా తూర్పు
» క్లాసుగా తిరుగుతూ దందాలు
» క్లాసులతో సరిపెడుతున్న పోలీస్
» సర్వనాశనమవుతున్న యువత
» పరారీలో డీటీ మణిదీప్..
» బెయిల్‌కి ముందస్తు ప్రయత్నం
» పసిగట్టడంలో నిఘా పడక
» మామూళ్ల మత్తులో పోలీస్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఏ మూల మాదక ద్రవ్యాలు దొరికినా మూలాలు తూర్పున కనిపిస్తున్నాయి. ఎక్కడో పట్టుబడిన గంజాయి వాసనకు జిల్లా కేంద్ర బిందువుగా మారుతోంది. చివరికి డ్రగ్స్‌లోనూ అదే తీరు కనిపిస్తోంది. తాజాగా హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్ కేసులో కీలక వ్యక్తిగా రాజమహేంద్రవరానికి చెందిన డిప్యూటీ తహశీల్దార్ మణిదీప్ వ్యవహారం మరింత చర్చకు తెరలేపింది. వైసీపీ ప్రభుత్వంలో గంజాయి, డ్రగ్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మూలన చర్యలు ఆరంభించింది. ఈగిల్ టీంను సిద్ధం చేసింది. దీంతో డ్రగ్స్ డొంకలు కదులుతున్నాయి. డిప్యూటీ తహశీల్దార్ డ్రగ్స్ వ్యవహారం కలకలం రేపుతోంది.

కమ్మేస్తున్న గంజాయి పొగ

ఎక్కడ పోలీసులు మాదక ద్రవ్యాలు పట్టుకున్నా ఉమ్మడి తూర్పుగోదావరితో ఏదొక లింకు ఉంటోంది. ఈనెల 16న నెల్లూరు బాలాజీనగర్ పీఎస్ పరిధిలో కారులో గంజాయి తరలిస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం రావడంతో రంగంలోకి దిగారు. కారు డ్రైవరు పోలీసులను ఢీకొట్టి కారుతో పరారయ్యే ప్రయత్నం చేశాడు. వెంబడించిన పోలీసులు రెండు రౌండ్లు కాల్పులు జరిపి ఒక వ్యక్తిని, 22 కిలోల గంజాయిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి రాజమహేంద్రవరానికి చెందిన బీరక ప్రకాశ్ అలియాస్ సూర్యప్రకాశ్ అని గుర్తించారు. ఈనెల 8న ధవళేశ్వరం ఐవో సీఎల్ కాలనీకి చెందిన సతీశ్ అదృశ్యమయ్యాడు. అతనితోపాటు రైళ్లలో సమోసాలు విక్రయించే స్నేహితులు గంజాయి తాగిన మైకంలో చంపేశారు. కుళ్లిన స్థితిలో ఆ యువకుడి శవం లభ్యమైంది. సుమారు రెండేళ్ల కిందట రాజమండ్రికి చెందిన ఓ యాంకర్ హైదరాబాద్‌లోని గంజాయి కేసులో ఆరోపణలు ఎదుర్కొన్నాడు. పోలీసులు ఏమీలేదని తీసి పారేస్తున్నా జరుగుతున్న ఘటనలు నిజమని రుజువు చేస్తున్నాయి. రాజమహేంద్రవరంతోపాటు గ్రామాలకు సైతం గంజాయి పాకేసింది. సిగరెట్లలో పొగాకు తీసేసి అందులోకి నేరుగా గంజాయి నింపి పెద్దఎత్తున విక్రయాలు జరుపుతున్నారు.



చుక్‌చుక్‌లో గప్‌చుప్‌గా

స్టూడెంట్స్ మాదిరిగా బ్యాగులు తగిలించుకొని రైళ్లలో గంజాయి ఆకు, పొడి, లిక్విడ్ రూపాల్లో హైదరాబాద్ పబ్‌లకు సరఫరా చేస్తున్నారు. దీనికి రాజమండ్రి, సామర్లకోట, తుని, అన్నవరం, అనకాపల్లి రైల్వే స్టేషన్లను ఎంచుకుంటున్నారు. విశాఖ వైపు నుంచే వచ్చే బొకారో, కోణార్క్, గువాహటి తదితర రైళ్లు గంజాయి రవాణాకు అనువుగా మారాయని ఇప్పటికే రైల్వే పోలీసులు గుర్తించారు. ఆ రైళ్లలో బోగీలు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటాయి. దీంతో తనిఖీలు చేయడం అసాధ్యం. గంజాయి తీసుకెళ్తున్నవాళ్లు హైదరాబాద్, బెంగళూరు వైపు వెళ్తారు. కొందరు విజయవాడలో దిగిపోయి చెన్నై లేదా చెన్నై వెళ్ల కుండా కాట్పాడి జంక్షన్ మీదుగా నేరుగా వెళ్లే రైళ్లను ఎంచుకొని సేలం, ఈరోడ్‌కు చేరుస్తున్నారు.

నిద్దరోతున్న నిఘా

జిల్లాలోని పోలీస్, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ వంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల్లో నిఘా నిద్దరోతున్నట్టుగా పరిస్థితులు చెబుతున్నాయి. ముఖ్యంగా పోలీస్‌కి సంబంధించి ప్రతి స్టేషన్‌లో ఒక నిఘా విభాగ పోలీస్ ఉంటారు. ఆ పీఎస్ పరిధిలోని అనుపానువులు పసిగట్టి స్పెషల్ బ్రాంచి అధికారులకు తెలియజేస్తే నేరుగా ఎస్పీ చెవికి చేరతాయి. అయితే పోలీస్ నిఘా వృత్తేతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందనే విమర్శలున్నాయి. ఈగిల్ టీం, నిఘా విభాగం ఎవరి దారి వారిదే అన్నట్టుగా ఉన్నాయి. కనీసం నగరాలను ఆనుకొని ఉన్న ప్రాంతాల్లోని రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లలో జరుగుతున్న అసాంఘిక పార్టీలపై కూడా నిఘా ఉండడం లేదంటే.. ఆ పరిస్థితులే మణిదీప్ వంటి వారి దందాలకు ఊతంగా మారాయని చెప్పక తప్పదు. మరోవైపు ఎక్సైజ్ పోలీసులు మద్యం వ్యాపార ప్రక్రియలో బిజీగా ఉంటున్నారు.



హైదరాబాద్‌లో రేవ్ పార్టీలో డ్రగ్స్‌తో పట్టుబడిన యువత (ఫైల్)



స్నేహితులకు మెసేజ్

డీటీ..ఇదేంటి?

ఏపీ నుంచి వెళ్లి డ్రగ్స్‌తో రేవ్ పార్టీ చేసుకుంటున్న ఆరుగురిని తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ వింగ్, గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రావులపాలెం, ఆలమూరు, రాజమహేంద్రవరానికి చెందిన వాళ్లే.. వీళ్లను పట్టుకుని తీగ లాగితే ధవళేశ్వరం పోలవరం భూసేకరణ పరిపాలనా కార్యాలయంలో చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న మణిదీప్ డొంక కదిలింది. 2012లో కారుణ్య నియామకం కింద రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా జాయినైన మణిదీప్.. ఆర్‌ఐగా ఉన్న సమయంలో లంచం ఆరోపణలతో సస్పెన్షన్‌కి గురయ్యాడు. అనంతరం డ్రగ్స్ ముఠాలతో పరిచయాలు పెంచుకున్నాడు. ఏడాదికి మూడొంతులు హైదరాబాద్, ఊటీలోనే ఉంటాడు. విలాసవంతమైన పార్టీలను ప్యాకేజ్‌గా ఒప్పుకోవడం ప్రవృత్తిగా చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని రేవ్ పార్టీ పెట్టిన గెస్ట్‌హౌస్ కూడా ఇతనే రాజమహేంద్రవరం నుంచి బుక్ చేశాడని ప్రచారం జరిగింది. అలాగే మణిదీప్ తరచుగా నామవరం రోడ్‌లోని ఓ విలాసవంతమైన రిసార్ట్‌లో పార్టీలు పెట్టేవాడు. రాజానగరం తదితరచోట్ల ఉన్న రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లు ఇతడి చేతిలోనే పెట్టుకున్నాడని కూడా చెబుతారు. అలాగే రాజమహేంద్రవరం కేంద్రంగా గంజాయి లోకల్‌గా సమకూరుస్తూ ఖరీదైన డ్రగ్స్ కొకైన్, ఎండీఎంఏ వంటి వాటిని ముంబై, బెంగళూరు నుంచి తీసుకువస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇక రాజమహేంద్రవరం సమీపంలోను, రాజానగరం ప్రాంతంలోను మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలు ఎక్కువ. సుమారు 4 వేల మందిపైనే విద్యార్థులుంటారు. వీరిని లక్ష్యంగా చేసుకుని మధ్యవర్తుల ద్వారా డ్రగ్స్‌ని విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. మణిదీప్ తన రేవ్ పార్టీల సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. మణిదీప్ రకరకాల నిషేధిత డ్రగ్స్‌ని పరిచయం చేసి కుర్రాళ్లను నాశనం చేస్తున్నాడని ఆరోపిస్తూ ఒక వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా ప్రస్తుతం మణిదీప్ పరారీలో ఉన్నాడు. ముందస్తు బెయిల్ ప్రయత్నిస్తున్నాడని చెబుతున్నారు. తెలంగాణ పోలీసుల నుంచి సమాచారం వచ్చిన వెంటనే మణిదీప్ వద్దకు వెళ్లిన స్పెషల్ బ్రాంచి పోలీసులు అతడు చెప్పింది విని వెనుదిరగడం ఆరోపణలకు తావిస్తోంది. మణిదీప్‌కి ఎంతటి వారినైనా డబ్బుతో లొంగదీసుకోవడం అలవాటు కాబట్టి ఇప్పుడూ అదే జరిగి ఉంటుందనే విమర్శలున్నాయి. ఈ కేసుతో తనకు సంబంధం లేదంటూ తన స్నేహితులకు మణిదీప్ సోమవారం రాత్రి ఒంటి గంట సమయంలో వాట్సాప్ మెసేజ్ పెట్టడంపై వాళ్లే విస్తుపోతున్నారు.



కాకినాడలో మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

కూటమి పాలనలో ఏడాదిన్నరలోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

మంత్రి లోకేశ్ చొరవతో చవితి ఉత్సవాలకు ఉచిత విద్యుత్

అభినందనీయం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

వైసీపీ హయాంలో స్మార్ట్ సిటీ నిధులు దుర్వినియోగం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం సర్వముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. కేంద్రప్రభుత్వం నిధుల కొరత లేకుండా రాష్ట్రానికి సహకరిస్తోందని ఆయన స్పష్టంచేశారు. సారథ్యం పేరుతో బీజేపీ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం కాకినాడ జిల్లాలో పర్యటించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. మాధవ్ ఉదయం చాయ్ పే చర్చలో పాల్గొని స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మల్లాడి సత్యలింగ నాయకర్ విగ్రహానికి నివాళులర్పించి, టూటౌన్ సెంటర్ నుంచి భారీ ర్యాలీకి నాయకత్వం వహించారు. సూర్యకళా మందిరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మంత్రి లోకేశ్ వినాయక చవితి పండుగకు రాష్ట్ర ప్రభుత్వం తరుఫున ఉచిత విద్యుత్ ఇవ్వడం స్వాగతించదగ్గ పరిణామం అన్నారు. రాబోయే దసరా నవరాత్రులకు కూడా అదే విధంగా ఉచిత విద్యుత్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం వినాయక చవితి, దసరా ఉత్సవాలకు ఎన్నో ఆంక్షలు విధిస్తూ భక్తులకు మరెన్నో ఇబ్బందులను కలిగించారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి వల్ల కాకినాడ జిల్లాలో అనేక అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఉప్పాడ తీరప్రాంతం కోత సమస్య పరిష్కారానికి జియో ట్యాగ్ లైన్ నిర్మాణం, మడ అడవుల అభివృద్ధి, పరిశ్రమలకు భారీ స్థాయిలో పెట్టుబడులు రావడం వాటిలో ముఖ్యమని వివరించారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ఏడాదిన్నరలోనే 10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని ఆయన వెల్లడించారు. సౌరశక్తి ఉత్పత్తి, సూర్యగృహ వంటి కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయని తెలిపారు. ఇండియా కూటమి ప్రతిరోజూ అబద్ధపు ప్రచారమే చేస్తోందని ఆరోపించారు. కానీ కూటమి పాలనలో పారదర్శకత, అభివృద్ధి రెండు కలిసి నడుస్తున్నాయని మాధవ్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కాలంలో కాకినాడ స్మార్ట్ సిటీ నిధులు దుర్వినియోగానికి గురయ్యాయని విమర్శించారు. భవిష్యత్తులో నగరంలో ఆధునిక అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, ఎలక్ట్రిక్ తీగలేని ఆధునిక పట్టణ రూపకల్పన చేస్తామని హామీ ఇచ్చారు. కోటిపల్లి రైల్వే లైన్ నిర్మాణం ఆలస్యం వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయకపోడమే కారణమని, త్వరలోనే ఈ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, మీడియా ఇంచార్జ్ తుమ్మలపల్లి నాని, యెనిమిరెడ్డి మాలకొండయ్య, పైడా కృష్ణమోహన్, విశ్వనాథపల్లి శ్రీనివాస్ రాజు, రంబాల వెంకటేశ్వర రావు, కాళ్ళ ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎరువుల దుకాణాలపై విస్తృత దాడులు

» యూరియా పక్కదారి పట్టకుండా తనిఖీలు » 52 ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): యూరియాకు కొరత తలెత్తడంతో అది బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాకినాడ జిల్లాలో మంగళవారం 52 ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. కాజులూరులో ఒక దుకాణంలో స్టాక్ రికార్డుల్లో వ్యత్యాసం ఉండడంతో 6(ఎ) కేసు నమోదు చేశారు. వివిధ మండలాల్లో యూరియా నిల్వల స్టాక్ రిజిస్టర్లను అధికారులు పరిశీలించారు. ఒక్కో రైతుకు ఏ మేరకు యూరియా బస్తాలు విక్రయిస్తున్నారు వంటి అంశాలను పరిశీలించారు. ప్రైవేటు డీలర్లు యూరియాను బ్లాక్ మార్కెటింగ్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారా అనే విషయాన్ని ముమ్మరంగా తనిఖీ చేశారు. యూరియా నిల్వ చేసిన గోదాములను పరిశీలించారు. వేట్లపాలెంలో ఒక ప్రైవేటు దుకాణంలో సరుకు రికార్డుల్లో వ్యత్యాసాన్ని గుర్తించి 6 (ఎ) కేసు నమోదు చేశారు. జిల్లాలో దాడులు మరిన్ని రోజులు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. ఇక సోమవారం సాయంత్రం కాకినాడ జిల్లాకు 400 మెట్రిక్‌టన్నుల యూరియా వచ్చింది. కేవలం మంగళవారం ఒక్క రోజులో 400 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయి. యూరియా కొరత ఉందనే ప్రచారం జరగడం వల్లే రైతులు అదనంగా బస్తాలు కొనుగోలు చేసుకుని నిల్వ చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే యూరియా కోసం రైతులు జిల్లాలో వివిధ మండలాల్లో బారులు దీరుతున్నారు. జిల్లాకు ఈనెల 29వ తేదీన మరో 2వేల మెట్రిక్ టన్నుల యూరియా రానుందని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గతేడాది ఇదే సమయానికి జిల్లాలో రైతులు 15,500 మెట్రిక్‌టన్నుల యూరియా కొనుగోలు చేయగా ఇప్పుడు 15,590 మెట్రిక్ టన్నులు యూరియాను విక్రయించామన్నారు. ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన యూరియా జిల్లాకు సరఫరా అవుతుందన్నారు. మోతాదు మేరకు మాత్రమే యూరియా పంట పొలాల్లో చల్లాలని సూచించారు.



జేడీ విజయ్‌కుమార్‌కి జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

రెడ్‌క్రాస్ క్యాన్సర్ బ్లాకు నిర్మాణం త్వరలో : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక క్యాన్సర్ వైద్యాన్ని అందించడానికి కాకినాడలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో త్వరలో క్యాన్సర్ బ్లాకు నిర్మిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్లో మంగళవారం జరిగిన రెడ్‌క్రాస్ జిల్లాశాఖ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ సంస్థ శత వార్షికోత్సవాలు, క్యాన్సర్ బ్లాకు నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకినాడ జిల్లా రెడ్‌క్రాస్ శాఖ వైడీ రామారావు ఆధ్వర్యంలో విజయవంతంగా నడుస్తోందన్నారు. 2025-28 సంవత్సరానికి రెడ్‌క్రాస్ ఛైర్మన్‌గా వైడీ రామారావు, వైస్ ఛైర్మన్‌గా సుగుణ, కోశాధికారిగా ప్రసాద్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా శివరామకృష్ణ, బాదం బాలకృష్ణ, చంద్రశేఖర్, పైడా భావనప్రసాద్, ఆకెళ్ల శాస్త్రి, భానుమతి, ముంజులూరి విశ్వేశ్వరరావు, విజయ్‌ప్రకాశ్ ఎన్నికయ్యారు. వారితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అత్యధికంగా రక్తదానం చేసిన ప్రభుత్వ శాఖల్లో వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్, పిఠాపురం ఎంపీడీవో, ప్రత్తిపాడు తహసీల్దారు ఎం.సూర్యప్రభలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

ఈజీ ఆఫ్ డూయింగ్‌లో సంతృప్తికరమైన సేవలు : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అన్ని శాఖల నుంచి సేవలు పొందిన లబ్ధిదారులను సంప్రదించి సర్వే జరిగే తరుణంలో సంతృప్తికరమైన అభిప్రాయాలు రావాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. స్మార్ట్‌సిటీ మీటింగ్ హాలులో ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా మంగళవారం వర్క్‌షాప్ జరిగింది.



విఘ్నాధిపతి..అయినవిల్లి వినాయకుడు

అయినవిల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు అయినవిల్లి ముస్తాబైంది. భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.అయినవిల్లి వినాయకుడు విఘ్నాలను తొలగించే స్వామిగా పేరొందారు. వినాయక చవితి.. స్వామికి ఇష్టమైన బుధవారం రావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు దర్శనం కల్పిస్తారు. ఏ కార్యక్రమం తలపెట్టినా ముందుగా అయినవిల్లి వినాయకుడిని పూజిస్తే విఘ్నాలు లేకుండా పూర్తవుతుందని భక్తుల నమ్మకం.స్థల పురాణం ప్రకారం ఈ క్షేత్రం కాణిపాక వినాయక క్షేత్రం కన్నా పురాతనమైనది. అయినవిల్లిలో స్వర్ణ గణపతి మహాయజ్ఞం జరుగుతుండగా వినాయకుడు ప్రత్యక్షమై అక్కడి వారిని అనుగ్రహించాడని 14వ శతాబ్దంలో శంకరభట్టు రాసిన శ్రీపాదవల్లభ చరిత్రలో ఉంది. ఆ సమయంలో వినాయకుడిని హేళన చేసిన ముగ్గురు మూర్ఖులను వినాయకుడు దండించగా తర్వాత కాలంలో వారే మూగ, చెవిటి, గుడ్డి వారిగా జన్మించి కాణిపాకం వినాయకుడి ఆవిర్భవాన్ని గుర్తించారని స్థల పురాణం చెబుతోంది.

కోర్కెలు తీర్చే.. బిక్కవోలు గణేశుడు..

బిక్కవోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చెవిలో చెబితే చాలు కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి కెక్కిన బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం నుంచి నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసారు. తూర్పు చాళుక్యుల కాలంలో 1100 సంవత్సరాల కిందట పంటపొలాల్లో స్వామి స్వయంభూగా వెలిశాడు. బిక్కవోలు వినాయకుడు పదకొండు అడుగుల ఎత్తు, ఆరు అడుగుల వెడల్పుతో దర్శనమిస్తాడు. స్వామి తొండం కుడివైపునకు ఉండడంతో కోర్కెలు చెబితే తప్పక నెరవేరుస్తాడని భక్తుల నమ్మకం. బుధవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా భారీ క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. బుధవారం తెల్లవారుజామున 1.58 గంటలకు స్వామికి అలంకారం చేసిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. ఉదయం 7 గంటలకు గ్రామోత్సవం జరుపుతామన్నారు. ఉదయం 11.04గం.లకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు కలశస్థాపన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు.



జై జై గణేశా!

జై జై గణేశా.. జైకొడతాం గణేశా అంటున్నారు.. ఊరూవాడా చవితి సందడి వచ్చేసింది.. వినాయక పందిళ్లలో విగ్రహాలను ఏర్పాటు చేశారు.. బుధవారం నుంచి 9 రోజుల పాటు ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని బిక్కవోలు, అయినవిల్లి వినాయక ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చవితి సందర్భంగా చామంతి, మల్లెలు, జాజులు తదితర పువ్వుల ధరలు చుక్కలనంటాయి..





ఐడియా.. అదిరింది!

తాళ్లపూడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గణేశుడిని ప్రతి రోజూ చూస్తూనే ఉంటారు.. ఎందుకంటే విద్యార్థులు కదా.. చవితికి ఏం చేద్దామా అని ఆలోచించారు.. వినాయకుడి వేషధారణలు.. పూజలు ఓల్డ్.. కొత్తగా ఏదైనా చేద్దామనుకున్నారు.. వినాయకుడి కూర్పుగా తయారైతే ఎలా ఉంటుందా అని ఆలోచించారు.. కాస్త కష్టమే కానీ.. ట్రై చేద్దామని ముందుగా ముగ్గుతో వినాయకుడి ప్రతిమ గీశారు.. ఆ తరువాత ఒక్కొక్కరుగా విద్యార్థులు ఇలా కూర్చుకున్నారు. తీరా చూస్తే వినాయకుడి ప్రతిమ కళ్లకు కట్టినట్టు వచ్చింది.. తాళ్లపూడి మాంటిస్సోరీ పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులు ఇలా వినాయకుడి ఆకృతిని చిత్రీకరించారు.



పువ్వులు.. అధరహో!



కడియం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పువ్వుల ధరలు అదిరిపోతున్నాయి. చామంతులు ఒక్కో పువ్వు లెక్కన విక్రయిస్తున్నారు. ఒక్కో పువ్వు రూ.2ల వరకూ ధర పలుకుతోంది. కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్ వినాయక చవితి శోభను సంతరించుకుంది. దీంతో పూల ధరలు ఒక్కసారిగా రెట్టింపు పెరిగాయి. కర్నాటక నుంచి బంతి, తమిళనాడు నుంచి చామంతి పూలను దిగుమతి చేసుకుని వ్యాపారస్తులు విక్రయిస్తుంటారు. మిగిలిన పూలు మన ప్రాంతంలోనే లభిస్తాయి. కడియపులంక పూలమార్కెట్ అటు కొనుగోలుదారులు, వ్యాపారస్థులు, ఇటు రైతులతో కిటకిటలాడింది. వినాయక చవితి సందర్భంగా పూలధరలు ఇలా ఉన్నాయి.

- అమాంతంగా పెరిగిన ధరలు
- చామంతులు కేజీ రూ.400
- మల్లెలు..జాజుల ధర టాప్

పువ్వుల ధరలు ఇలా ఉన్నాయి..

పూలు	గతంలో	ప్రస్తుతం
చామంతి (కేజీ)	రూ. 300	రూ. 500- 600
మేరీగోల్డ్ చామంతి(కేజీ)	రూ. 200	రూ. 400
నీలం చామంతి (కేజీ)	రూ. 200	రూ. 450
కలకత్తా బంతి (కేజీ)	రూ.60	రూ. 100 - 130
పసుపు బంతి (కేజీ)	రూ. 60	రూ. 199 - 130
లిల్లీ (కేజీ)	రూ. 200	రూ. 400
జాజులు (కేజీ)	రూ.500	రూ. 1,000
మల్లెలు (కేజీ)	రూ. 600	రూ. 1,300
కాగడాలు (కేజీ)	రూ. 600	రూ. 600
స్టార్‌గులాబీ (కేజీ)	రూ. 180	రూ. 300
సెంటుగులాబీ (కేజీ)	రూ.150	రూ. 250
కనకంబరం (బారు-1)	రూ.150	రూ. 200 - 220

గణేశా..తమాషా!

మామిడికుదురు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గణేశుడి ఆకారం ఎలాగైనా ఇమిగిపోతోంది.. అందుకే రకరకాలుగా విగ్రహాలు తయారుచేస్తారు..పూజిస్తారు..ఈ చిత్రంలోనే చూస్తున్నారుగా..ఈ విగ్రహం ఏమిటో గుర్తుపట్టారా.. ఏదో మొక్కజొన్న గింజలతో తయారుచేసిన గణేశుడు అనుకుంటున్నారు కదా..కాదు కాదు.. కందిపప్పును అతికించి ఇలా పర్యావరణ గణేశుడిని తయారుచేశారు. మట్టి గణపతిని పూజించండి.. పర్యావరణాన్ని రక్షించండి అంటూ మామిడికుదురు దీప్తి పాఠశాల విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు.పర్యావరణానికి హాని కలగకుండా పీచు, మట్టి, కందిపప్పు, పసుపు, కుంకుమ, పిండి, కూరగాయలు, పండ్లు వంటి పలు రకాలతో వినాయక ప్రతిమలు తయారుచేసి ప్రదర్శించారు. నీటిలో కరిగిపోయే వస్తువులతో గణపతిని తయారు చేసి పూజించాలని విద్యార్థులు అవగాహన కల్పించారు.



మన బుజ్జి గణేశులు

ఆలమూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వచ్చిందంటే ఆ సందడే వేరు.. చిన్నారుల నుంచి పెద్దల వరకూ అందరికీ పండగే.. ఈ చిత్రంలోనే చూడండి.. మన బుజ్జి వినాయకులు ఎలా ముస్తాబయ్యారో.. బుధవారం వినాయక చవితి సెలవు కావడంతో పాఠశాలల్లో మంగళవారమే ఉత్సవా లు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో మంగళవారం ఇలా దర్శనమిచ్చారు. స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు ముందుగా వినాయక పూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. వినాయక జన్మవృత్తాంతాన్ని ఆయన విద్యార్థులకు వివరించారు.

లౌడీయిజం వద్దు!

కాకినాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గణపతి ఉత్సవాలు వచ్చాయంటే సంబరాలు అంబరాన్నంటుతాయి. వినాయక నిమజ్జనం ఇతర సమయాల్లో భారీ డీజే శబ్దాలతో పందిళ్లలో మోత మోగిస్తారు. డీజేలు నయా ట్రెండ్.. వాటి నుంచి 60 డెసిబుల్స్‌ను మించి శబ్దం వస్తుండడంతో ప్రజలు వివిధ రుగ్మతల బారిన పడుతున్నారు. వినికిడి లోపానికి గురవుతున్నారు. కొన్నిసార్లు గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో అమలాపురం పట్టణంలో ఒక యువకుడు డీజే శబ్దాలకు గుండెపోటుకు గురై మృతి చెందాడు. సాధారణంగా మన చెవులు 120-130 డెసిబుల్స్ మాత్రమే భరించగలవు. అంతకు మించితే ప్రమాదమే.60 డెసిబుల్స్‌లోపు శబ్దం వింటే ఇబ్బందులు ఉండవు. వంద డెసిబుల్స్ దాటితే గుండె జబ్బులు ఉన్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. 110, 120 డెసిబుల్స్ దాటితే విపరీతమైన కోపం, తలనొప్పి వస్తుంది.160 డెసిబుల్స్ దాటితే చెవుల్లో వినికిడి కణాలపై ప్రభావం చూపుతుంది. 190 డెసిబుల్స్ దాటితే వినికిడి శక్తి కోల్పోతారు. డీజే బాక్సుల నుంచి వచ్చే వైబ్రేషన్ కారణంగా నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. మెదడుకు రక్తసరఫరా తగ్గి, గుండెకు రక్తం సరఫరా చేసే నాళాలు మూసుకుపోతాయి. గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. గర్భిణులకు డీజే వైబ్రేషన్స్ ప్రమాదకరమే.అటువంటి ప్రమాదకరమైన డీజేలను నిషేధించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.దీంతో "డీజేలు వద్దు. తీన్మార్‌లు ముద్దు" పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్నారు. ఈ సారి పందిళ్లలో డీజేలు ఏర్పాటు చేయవద్దని, తీన్మార్‌లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా పోలీసు అధికారులు సూచిస్తున్నారు.పోలీసుల అనుమతి లేకుండా డీజేలు, బాణసంచా వాడరాదంటూ సూచనలు చేస్తున్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరిపేలా ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు పాటించాలని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు లౌడ్ స్పీకర్లు వాడరాదని, ఇలా పలు నియమనిబంధనలు విధించారు.



ఆవేశంలో మాట్లాడా..క్షమించండి!

మహాసేన రాజేష్

పిఠాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆవేశంలో తాను మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్తున్నట్టు 'మహాసేన' రాజేష్ తెలిపారు. 2020 లో కాకినాడ జిల్లా పిఠాపురంతో పాటు పలు చోట్ల విగ్రహాలు, ఆలయాలను ధ్వంసమయ్యాయి. దీనిపై అప్పట్లో హిందూ సంఘాలు, బ్రాహ్మణులు ఆందోళనలు నిర్వహించారు.ఇదే సమయంలో బ్రాహ్మణులను కించపరిచేలా మహాసేన రాజేష్ సోషల్ మీడియాలో మాట్లాడారు.దీనిపై అప్పట్లో బ్రాహ్మణ, హిందూ సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. తదనంతరం పరిణామాల నేపథ్యంలో మంగళవారం పిఠాపురం పాదగయ క్షేత్రానికి వెళ్లిన మహాసేన రాజేష్ బ్రాహ్మణులకు, హిందూ సంఘాలకు క్షమాపణ తెలిపారు.తనకు ఉన్న సమాచారంతో అప్పట్లో మాట్లాడానని, అంతేగానీ ఎవరిపైనా ద్వేషంతో మాట్లాడలేదని చెప్పారు. ఒకరిద్దరి కోసం మాట్లాడిన విషయం సమాజాన్ని బాధపెట్టిందని గుర్తించి, వారు కోరకపోయినా క్షమాపణ చెప్తున్నట్టు తెలిపారు. వారు కేసు విత్‌డ్రా చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో హిందూ, పురోహిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

28 నుంచి జీజీయూలో అంతర్జాతీయ సదస్సు

రాజానగరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ(జీజీయూ)లో ఈ నెల 28, 29 తేదీల్లో హరిత ఆర్థిక వ్యవస్థ(గ్రీన్ ఎకానమీ), స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు(సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్-ఎస్‌డీజీఎస్), కృత్రిమ మేధ ఆధారిత హరిత సాంకేతికతలు(ఆల్ ఫర్ గ్రీన్ టెక్నాలజీ)అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు వర్శిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) తెలిపారు. ఇందుకు సంబంధించి వర్శిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రొ వైస్ చాన్సలర్ కేవీబీరాజుతో కలిసి వెల్లడించారు. తైవాన్‌లోని నేషనల్ సన్ యాట్-సెన్ యూనివర్శిటీ భాగస్వామ్యంతో, నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్(ఎన్‌ఎస్‌టీసీ)తైవాన్ సౌజన్యంతో జరిగే ఈ సదస్సులో పలు రాష్ట్రాల ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలతో పాటు తైవాన్ నుంచి ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు,నిపుణులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పిఎంఎంఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీ 4.0, 5.0 టెక్నాలజీపై అవగాహన సదస్సు

జేఎన్టీయూకే, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని అలూమ్ని ఆడిటోరియంలో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్ వీహబ్, అటల్ ఇన్నోవేషన్ మిషన్(ఏఐఎం), నీతిఅయోగ్, మైటీ స్టార్టప్ హబ్ సహకారంతో ఇండస్ట్రీ 4.0, 5.0 సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు, అధ్యాపకులకు ఇంక్యుబేషన్, యాక్సలరేషన్ సహకారం అనే అంశంపై డైరెక్టర్ ఆఫ్ ఇన్నోవేషన్స్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ అధ్యక్షతన అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. అతిథులుగా అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్ వీహబ్ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి జహారుల్లా ఎస్ఎండీ, జేఎన్టీయూ వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, అకడమిక్స్ డైరెక్టర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ విచ్చేశారు. జహారుల్లా తన 17 ఏళ్ల అనుభవాన్ని పంచుకుంటూ డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈ ఆవిష్కరణ నమూనాలు, టైడ్ 2.0 ద్వారా వచ్చిన అవకాశాల ప్రాముఖ్యతను వివరించారు. వీసీ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్యా సంస్థలు కేవలం బోధన, పరిశోధనా పరిమితులే కాకుండా ఆవిష్కరణ, వినూత్న ఆలోచనల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ప్రామాణికతతో కూడిన పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. సదస్సులో యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీపాదవల్లభునికి

సహస్ర గులాబీ అర్చన

పిఠాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాదవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో ఆరో రోజైన మంగళవారం సహస్ర గులాబీ అర్చన నిర్వహించారు. శ్రీపాదవల్లభుడు, దత్తాత్రేయస్వామి నృసింహసరస్వతులను విశేషంగా అలంకరించారు. శత రుద్రాభిషేకం, సర్వపుష్ప పూజ, సహస్రనామార్చన, మంగళహారతి, వేదపారాయణ, దత్త మూలమంత్ర అనుష్ఠానము, గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణం జరిగాయి. ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొడనూర్-బారౌనికి 26 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌లు



సామర్లకోట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పొడనూర్-బారౌని-పొడనూర్ మధ్య రాజమహేంద్రవరం మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు సెప్టెంబరు 6 నుంచి నవంబరు 29 వరకూ 26 వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్టు మంగళవారం ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా వెల్లడించారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది. 06055 నెంబరు గల రైలు పొడనూర్-బారౌనిల మధ్య సెప్టెం బరు 6నుంచి నవంబరు 29వరకూ ప్రతీ శని వారం పొడనూర్‌లో ఉదయం 11.50 నిమిషాలకు బయలుదేరనుంది. అలాగే 06056 నెంబరు గల రైలు బారౌని-పొడనూర్‌ల మధ్య సెప్టెంబరు 9 నుంచి డిసెంబరు 2 వరకూ ప్రతీ మంగళవారం బారౌనిలో రాత్రి 11.45 నిమిషాలకు బయలుదేరనుంది.

06055 నెంబరు గల ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు పొడనూర్‌లో ప్రతీ శనివారం ఉదయం 11.50 గంటలకు బయలుదేరుతుంది. పొడనూర్, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పెట్టయ్, కాట్పాడి, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాజమహేంద్రవరానికి ఉదయం 7.20గంటలకు చేరుతుంది. దువ్వాడ, సింహాచలం రోడ్డు, విజయనగరం, బొబ్బిలి, పార్వతీ పురం, రాయగడ, మునిగుడ, టిట్లాగర్, సంబల్ పూర్, రూర్కెలా, నౌవాగాన్, హటియా, రాంచీ, మురి, బొకారోస్టీల్ సిటీ, ధన్‌బాద్, బార్కార్, చిత్తరంజన్, మదుపూర్, జాసిది, జాహజా, కియుల్‌ల మీదుగా బారౌనికి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుతుంది.

06056 నెంబరు గల బారౌనీ-పొడనూరుల మధ్య ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు బారౌనీలో ప్రతీ మంగళవారం రాత్రి 11.45 గంటలకు బయలుదేరుతుంది. ఈ రైలు రాజమహేంద్రవరానికి బుధవారం ఉదయం 7.30గంటలకు చేరుతుంది. పొడనూరుకు శుక్రవారం తెల్లవారుజామున 3.45 గంటలకు చేరుతుంది. కాగా బారౌనీ-పొడనూరుల మధ్య గల 2,528 కిలోమీటర్ల దూరాన్ని ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు 2రోజుల 2గంటల 40 నిమిషాలు ప్రయాణించి గమ్యస్థానాన్ని చేరుతుంది.

ఈ రైలులో సెకండ్ ఏసీ బోగీ ఒకటి, థర్డ్ ఏసీ బోగీలు 3, స్లీపర్ క్లాస్‌బోగీలు, ఎస్ఎల్ఎండీ బోగీలు 2 వెరసి 23 బోగీలతో ప్రయాణించనుంది. ఈ రైళ్లలో వివిధ ప్రాంతాలకు ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కెట్ల కోసం సమీప రైల్వే స్టేషన్లలోని బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వుల్లో కోరారు.

ప్రకృతి సాగును విస్తరించాలి

- పీఎండీఎస్, డ్రమ్ షోయింగ్ పద్ధతులపై దృష్టి సారించాలి
- రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్



అనపర్తి సావరంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న విజయకుమార్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డెల్టాలోని రైతులు ప్రకృతి వ్యవసాయంలో మెరుగైన పద్ధతులను పాటించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని రైతు సాధికారత సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం బొమ్మూరు కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు మాట్లాడుతూ వ్యవసాయంలో తాము అమలు చేస్తున్న పద్ధతులు, వాటి ప్రభావం, మార్కెటింగ్ విధానాలపై చర్చించారు. పంటల్లో వైవిధ్యం, మల్చింగ్, జీవామృతం వినియోగం ప్రీమాన్‌సూన్ డ్రై షోయింగ్(పీఎండీఎస్) పద్ధతులను పాటించడం వల్ల వచ్చిన మార్పులను వివరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కలుపు నియంత్రణకు రసాయన మందులు వాడడం వల్ల ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో కలుపు సమస్య ఎదుర్కోవడానికి మల్చింగ్, సన్నని వరుసల సాగు, డ్రమ్ సీడ్ షోయింగ్ పద్ధతులు ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా రైతులకు శిక్షణ ఇవ్వడంతో పాటు తగు సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయం రైతుల పెట్టుబడిని తగ్గిస్తూ ఆదాయాన్ని పెంచుతుందని పశువులకు సంవత్సరం పొడవునా పచ్చి మేత లభిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఏపీసీఎంఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అనపర్తి సావరంలో క్షేత్ర సందర్శన

అనపర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఇదిలా ఉండగా విజయకుమార్ అనపర్తి సావరంలో ప్రకృతి సాగు చేపట్టిన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. పంట పొలాలను పరిశీలించి సాగుపై వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా మట్టిలో సారం పెరుగుతుందని, నీటి వినియోగం తగ్గుతుందన్నారు. ఖర్చులు తగ్గడమే కాకుండా ఆరోగ్యాలను కాపాడుకునే వీలు ఏర్పడుతుందనే విషయాలను రైతులకు చేరవేసి ప్రకృతి వ్యవసాయం విస్తరించే విధంగా అధికారులు కృషి చేయాలని విజయకుమార్ పేర్కొన్నారు.

ఉప్పాడ తీరం.. కల్లోలం!

ఎగసిపడుతున్న కెరటాలు

వేట విరమించిన మత్స్యకారులు



కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు

కొత్తపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంపై చూపుతోంది. వాతావరణంలో ఏర్పడిన మార్పు లతో తీరం కల్లోలంగా మారి కెరటాలు ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డును తాకుతున్నాయి. దీంతో కొత్తపట్నం- సుబ్బంపేట మధ్య బీచ్‌రోడ్డు కోతకు గురవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. బీచ్‌రోడ్డుకు రక్షణగా ఏర్పాటుచేసిన రాళ్లు కెరటాల ధాటికి సముద్రంలో కొట్టుకుపోతున్నాయి. మయాపట్నం, సూరాడపేట మత్స్యకార ప్రాంతాల్లో కెరటాలు ఇళ్ల ముంగిట్లోకి దూసుకుపోతున్నాయి. మత్స్యకార కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. కెరటాల తీవ్రత అధికంగా ఉండడంతో ఉప్పాడ నుంచి కాకినాడ వాహనాలపై వెళ్లే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రికి సముద్రం మరింత ఉధృతంగా మారే పరిస్థితి ఉండటంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ సిబ్బందితో బీచ్‌రోడ్డులో వాహనాల రాక పోకలను నియంత్రించే చర్యలు చేపట్టారు. కాగా అల్పపీడన ప్రభావంతో తీరప్రాంతాలకు చెందిన మత్స్యకారులు స్వచ్ఛందగా వేట విరమించారు.



సుబ్బంపేట వద్ద కోతకు గురైన బీచ్‌రోడ్డు

పొంగి పొర్లుతున్న వాగులు

చింతూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో మళ్లీ ముసురు పట్టింది. మంగళవారం రోజంతా వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఎగువనున్న ఛత్తీస్‌గడ్, ఒడిస్సాలో కూడా ఇదే పరిస్థితి ఉండి ఉండడంతో ఆ నీరంతా శబరి, సీలేరు నదుల్లోకి చేరుతోంది. చింతూరు మీదుగా ఛత్తీస్‌గడ్ వెళ్లే 30 నంబరు జాతీయ రహదారిపై తేంగ్‌పాల్, జీదం ఘాట్ తదితర ప్రాంతాల్లో వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. చింతూరు, వరరామచంద్రపురం మండలాల నడుమ జల్లివారిగూడెం వాగు పొంగి ప్రవహిస్తోంది. చింతూరు, భద్రాచలం నడుమ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన పలు కల్వర్టుల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి వాహనదారులు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి ఉంది. అదే దశలో చింతూరు మీదుగా ఒడిస్సా వెళ్లే 326 నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు కూడా నత్తనడకన నడుస్తుండడంతో ఆ దిశగా కూడా ప్రయాణం కష్టతరంగా మారింది.



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా తొంగ్ పాల్ సమీపంలో రహదారిపై వరద నీరు



పొంగి ప్రవహిస్తున్న జల్లివారిగూడెం వాగు

అల్లూరి కలెక్టర్, రంప ఐటీడీఏ పీవోకు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి మహిళ మృతి వ్యవహారం

రంపచోడవరం/వై.రామవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి ఓ గిరిజన మహిళ మృతి చెందిన వ్యవహారంలో అల్లూరి జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. ప్రసవం కోసం 14 రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలోనే రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఉన్న తన భార్య కాకూరి పార్వతి(26) పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి మృతికి కారణమయ్యారని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని అనాథలుగా మిగిలిన తన ఇద్దరు పిల్లలకు న్యాయం చేయాలంటూ వై.రామవరం మండలం జాజిగడ్డకు చెందిన పడాల దుర్గాప్రసాద్ జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. జూలై 11న కాకూరి పార్వతి ప్రసవ సమయంలో మెరుగైన వైద్యం అందక ప్రాణాపాయస్థితికి చేరుకోవడంతో ఆమెను రాజమండ్రికి తరలించి ఇక్కడి వైద్యులు చేతులు దులుపేసున్నారని, గిరిజనులకు అండగా నిలవాల్సిన రంపచోడవరం ఐటీడీఏ కూడా గిరిజన మహిళ నిర్లక్ష్య మృతిపై సరిగా స్పందించలేదని కూడా ఫిర్యాదులో ఆరోపించాడు. ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించిన కమిషన్ అల్లూరి జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులకు నోటీసులు జారీ చేసి అభియోగాలపై తీసుకున్న చర్యల నివేదికను 15రోజుల వ్యవధిలో తమకు సమర్పించాలని కమిషన్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ రెడ్డి ఆదేశించారు. లేకపోతే చట్టపరంగా చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

మనస్తాపంతో రైతు మృతి

దేవదాయశాఖ భూమిలో సాగుచేయరాదని నోటీసు



చంద్రరావు (ఫైల్)

కొత్తపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్స లో సీతారామ స్వామికి సర్వే నంబరు 121/122లో 20 ఎకరాల భూమి ఉంది. ఆ భూముల్లో కొమరగిరికి చెందిన సుమారు 40మంది రైతులు ఎంతోకాలంగా సాగుచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో దేవుడి కి చెందిన భూముల విషయంలో రైతులు, దేవ దాయశాఖ మధ్య వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉంది. దీంతో ఆ భూముల్లో పలువురు రైతులు తొలకరి సాగు చేపట్టడంతో భూముల విషయం కోర్టులో ఉందని ఎవరూ పంటసాగుచేయరాదని ఇటీవల అధికారులు నోటీసులు జారీ చేశారు. ఐతే కొమరగిరికి చెందిన కండిపల్లి చంద్రరావు (70) సోమవారం దేవదాయశాఖ భూమిలో సాగుచేయడానికి వీలులేదని వీఆర్వో నోటీసుల జారీ చేశారు. ఆ సమయంలో చంద్రరావు మనస్తాపంతో కుప్పకూలి మృతి చెందినట్టు సహచర రైతులు తెలిపారు. చంద్రరావుకు రైతు సంఘం, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

భజనల మాస్టారు నాగేశ్వరరావు మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

సామర్లకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భజనల మాస్టారుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పేరొందిన శ్రీ వెంకటేశ్వరా ఆధ్యాత్మిక కళాకారుల సంఘం వ్యవస్థాపకులు పెండ్యాల నాగేశ్వరరావు(85) మాస్టారు చికిత్స పొందుతూ మృతిచెందారు. ప్రభుత్వ పాఠశాలల్లో 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన నాగేశ్వరరావు మాస్టారు పదవీ విరమణ అనంతరం గత రెండున్నర దశాబ్దాలుగా కాకినాడ జిల్లా వేట్లపాలెం వేంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపకులుగా ఆధ్యాత్మిక సేవలు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రముఖ ఆలయాలకు విస్తరింపజేసారు. వేలాది భజన సంఘాలను తయారుచేసి ఆలయాల్లో జరిగే భజనల పోటీల్లో పాల్గొనేలా ఉత్తమ శిక్షణ ఇచ్చారు. ఇటీవల అమరావతిలో టీటీడీ వేంకటేశ్వ రస్వామి ఆలయంలో పెద్దఎత్తున భజనలు నిర్వహించేందుకు అనుమతులు సైతం పొందారు. 10రోజుల కిత్రం వేట్లపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు మాస్టారు గుండెపోటుతో మృతిచెందారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ శ్మశాన వాటికలో నాగేశ్వరావు మాస్టారి అంత్యక్రియలు నిర్వహించారు. భజనసంఘాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు సంతాపం వ్యక్తం చేశారు.

'ఏలేరు'లో పెరుగుతోన్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతోన్నాయి. మెస్తారు వర్షాలు, గోదావరి జలాలు విడుదలతో రిజర్వాయర్‌లో నీరు పెరుగుతోంది. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 1050 క్యూసెక్కులు ఏలేరుకు విడుదలవుతున్నాయి. దీంతో ప్రాజెక్టులో 80.01 మీటర్ల స్థాయిలో 13.47 టీఎంసీల నిల్వలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు.



ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

రైలు ఢీకొని రైల్వే కార్మికుడి మృతి



మృతిచెందిన సత్యనారాయణ

సామర్లకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి కాకినాడ-విశాఖ బైపాస్ రైల్వే ట్రాక్‌పై విధి నిర్వహణలో ఉన్న సామర్లకోటకు చెందిన బంకపల్లి సత్యనారాయణ (44) అనే రైల్వే కార్మికుడిని మంగళవారం వేగంగా వెళ్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సామర్లకోట రైల్వే ఎస్ఎస్ ఎం.రమేష్ అందించిన సమాచారం మేరకు...పిఠాపురం రైల్వే సెక్షన్‌లో పనిచేస్తున్న సత్యనారాయణ ట్రాక్‌పై విధుల నిర్వహణలో వెనుక నుంచి రైలు రావడాన్ని గుర్తించలేకపోవడంతో ప్రమాదం సంభవించినట్టు రైల్వే పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపారు.

యూరియా... అగచాట్లు ఏంటయ్యా!

వర్షంలోనే గొల్లప్రోలు సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు





గొల్లప్రోలు సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

గొల్లప్రోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు అగచాట్లు తప్పడం లేదు. ఇటీవల భారీ వర్షాలు, వరదల అనంతరం యూరియాకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. ముంపునకు గురైన పొలాల్లో బూస్టర్ డోస్‌గా యూరియా వేయాలన్న వ్యవసాయశాఖ సూచనలు, అదే సమయంలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతుండడంతో ఎరువు వేయాల్సిన అవసరం ఏర్పడింది. కొద్ది రోజులుగా యూరియా ప్రవేటు దుకాణాల్లో అందుబాటులో లేకపోవడంతో సొసైటీలు, రైతు సేవా కేంద్రాలపైనే రైతులు ఆధారపడుతున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు సొసైటీ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. దీంతో సోమవారం రాత్రి 20 టన్నులు, మంగళవారం ఉదయమే మరో 20 టన్నుల యూరియాను గొల్లప్రోలు సొసైటీకి పంపారు. యూరియా వచ్చిందన్న సమాచారంతో రైతులు తెల్లవారుజాము నుంచే సొసైటీ వద్ద బారులు తీరారు. సుమారు అరకిలోమీటరు మేర రైతులు క్యూలో నిలుచున్నారు. రైతుకు రెండు బస్తాలు వంతున పంపిణీ చేశారు. వర్షం పడుతున్నా లెక్కచేయకుండా రైతులు బారులు తీరడం గమనార్హం. యూరియాకు ఎటువంటి కొరత లేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ స్పష్టం చేశారు. గొల్లప్రోలు సొసైటీ వద్ద రైతులు బారులు తీరిన విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం ఇక్కడకు చేరుకుని దగ్గరుండి రైతులకు యూరియా పంపిణీ చేయించారు. వర్మ వెంట టీడీపీ గొల్లప్రోలు పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు తదితరులు ఉన్నారు.

పేలిన గ్యాస్ బండ

పరుగులు తీసిన జనం

మురమళ్ళలో తప్పిన పెను ప్రమాదం

ఐ.పోలవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ 216 జాతీయ రహదారిని అనుకుని మాణిక్యాంబా అమ్మవారి ఆలయం వద్ద సోమవారం రాత్రి గ్యాస్ బండ పేలడంతో జనం భయంతో పరుగులు తీశారు. రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదం జరగడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఐ.పోలవరానికి చెందిన బొలిశెట్టి సత్యశ్రీనివాస్ మాణిక్యాంబ గుడి సెంటర్‌లో మిర్చి బండి వ్యాపారం చేసుకుంటున్నాడు. సోమవారం రాత్రి ఎప్పటి మాదిరిగానే రాత్రి 9.30 గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి దుకాణంలోని గ్యాస్ బండ పేలి రోడ్డుపైకి ఎగిరిపడింది. భారీ శబ్దంతో పాటు రహదారిపై మంటలు వ్యాపించడంతో ప్రయాణికులు, స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఎస్ఐ రవీంద్రబాబు, ముమ్మిడివరం అగ్నిమాపక దళం సంఘటనా స్థలికి చేరుకుని మంటలు నియంత్రించారు. ఈ ప్రమాదంలో మిర్చి బండితో పాటు ఒక జోళ్ళ షాపు దగ్ధమైంది.





గ్యాస్‌బండ పేలుడుతో సంభవించిన మంటలు, దగ్ధమైన దుకాణాలు

ఆ కట్టడం అన్నవరానిదే..!

కొండను ఆనుకుని ఉన్న ప్రైవేట్ నిర్మాణం

దేవదాయశాఖ, ఇరిగేషన్ శాఖల మధ్య పంచాయితీపై సర్వేలో వెల్లడి



దేవస్థానం, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్న సర్వే

అన్నవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం కొండను ఆనుకుని ఉన్న ప్రైవేట్ నిర్మాణం విషయంలో దేవదాయశాఖ, ఇరిగేషన్ శాఖల మధ్య వివాదంపై మంగళవారం సర్వే నిర్వహించగా వివాదాస్పద కట్టడం దేవస్థానం పరిధిలోనిదేనని రెవిన్యూ, సర్వే అధికారులు తేల్చిచెప్పినట్టు దేవస్థానం అధికారులు వెల్లడించారు. గత 15 ఏళ్లుగా ఈ నిర్మాణంపై వివాదం చెలరేగుతూనే ఉన్నా సర్వే అధికారులు సర్వే చేపట్టి ఏమీ తేల్చకుండా ఉండడంతో తరచూ దీనిపై రాద్ధాంతం జరుగుతూనే ఉంది. ఈ స్థలం ఇరిగేషన్ పరిధిలోనిదే అంటూ ఇరిగేషన్ అధికారులు, దేవస్థానం పరిధిలోనిదే అని అన్నవరం దేవస్థానం అధికారులు పేర్కొంటున్నా కొలిక్కిరాలేదు. దీనిపై జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలతో ల్యాండ్ సర్వే ఏడీఈ ఆధ్వర్యంలో పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పర్యవేక్షణలో సర్వే చేశారు. పంపా రిజర్వాయిర్ గట్టును ఆనుకుని లోపలకి సుమారు 70 అడుగులు దేవస్థానానికి చెందినట్టు అన్నవరం దేవస్థానం అధికారులు తెలిపారు. దీంతో నిర్మాణమంతా దేవస్థానం పరిధిలోకి వస్తుందని ఈఈ తెలిపారు. ఈ సమయంలో వివాదాస్పద కట్టడం యజమాని హరిగోపాల్ దీనిపై స్టే ఉందని తెలపడంతో ఆర్డీవో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది 2 శాఖల మధ్య వివాదమని థర్డ్‌పార్టీ ప్రమేయం ఉండకూడదని హెచ్చరించారు. సర్వేలో దేవస్థానం ఈవో సుబ్బారావు, ఈఈ రామకృష్ణ, లీజుల విభాగం అధికారులు, ఇరిగేషన్ ఈఈ శేషగిరి తదితరులున్నారు. దీనికి సంబంధించి కాగితాలు ఆర్డీవో కార్యాలయానికి తీసుకురావాలని సూచించారు. అయితే అన్నవరం దేవస్థానానికి చెందిన స్థలమేనని ప్రాథమిక నిర్ధారణకు రావడంతో ఈసారైనా దీనిని దేవస్థానం స్వాధీనం చేసుకుంటుందో లేదో వేచిచూడాలి.

పెళ్లి చేసుకుంటే పిల్లలు పుట్టరనే ఆందోళనతో..

యువకుడి ఆత్మహత్య

కలుపుమందు తాగిన వైనం

సీతానగరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం సింగవరం గ్రామానికి చెందిన బిట్రా సూరిబాబు (24) కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల ప్రకారం.. సూరిబాబు రాజమహేంద్రవరం ఆసుపత్రిలో వరి బీజం ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆందోళనగా ఉంటున్నాడు. ఆ ఆపరేషన్ వల్ల పెళ్లి చేసుకుంటే పిల్లలు పుట్టరనే ఆందోళనతో మానసిక వేదనకు గురై సోమవారం సాయంత్రం గ్రామంలోని పామాయిల్‌తోటలోకి వెళ్లి కలుపుమందు తాగాడు. ఆత్మహత్య చేసుకుంటున్నానని, కలుపుమందు తాగేశానని కోట సతీష్ అనే వ్యక్తికి చెప్పగా అతడు ఉప్పల దుర్గాప్రసాద్‌కు చెప్పాడు. అతడు విషయాన్ని సూరిబాబు కుటుంబ సభ్యులకు చేరవేశాడు. దీంతో బంధువులు, స్నేహితులు పామాయిల్ తోటకు వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న సూరిబాబును సీతానగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. ఈ మేరకు సూరిబాబు తండ్రి బిట్ర శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం చేయించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

పంటకాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం

అనుమానాస్పద మృతిగా కేసు



మరణించిన చిన్న (ఫైల్)

కొత్తపేట/అంబాజీపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముక్కామల- ఈదరపల్లి పంట కాలువలో వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని కొర్లపాటివారి పాలానికి చెందిన మేడిది రంగాజానకీ ప్రసాద్(చిన్న) (55) సోమవారం రాత్రి కొత్తపేట మండలం గొలకోటివారిపాలెం ప్రధాన పంటకాలువలో గల్లంతయ్యాడు. మృతదేహం పాలగుమ్మి బల్లకట్టురేవు వద్ద మంగళవారం సాయంత్రం లభ్యమైంది. దీనిపై అతడి సోదరుడు మేడిది శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొర్లపాటివారిపాలెంలో విషాదఛాయలు

అందరితో కలిసిమెలిసి ఉండే మేడిది రంగాజానకీప్రసాద్ (చిన్న) మృతితో కొర్లపాటివారిపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంబాజీపేట పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్‌గా, కొబ్బరి వ్యాపారి, టీడీపీలో క్రియాశీలక సభ్యుడిగా చిన్న పనిచేశారు. అంతేకాకుండా కొర్లపాటివారిపాలెంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. మృతుడు చిన్నకు భార్య పావనిరాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఎంఎస్ చదువుతున్నాడు. చిన్న మృతికి టీడీపీ నాయకులతో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఆబోతుల పొట్లాట.. గాయపడ్డ వ్యక్తి మృతి

అల్లవరం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుండెపూడి ఆంజనేయస్వామి గుడి వద్ద ఆబోతులు పొట్లాడుకుంటుండగా పక్కనున్న జంగా రామకృష్ణపై(41) అవి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని గ్రామస్తులు తెలిపారు. రామకృష్ణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపు 'నిధి ఆప్‌కే నికత్'

రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌వో రీజనల్ కార్యాలయం పరిధిలో గురువారం నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఎంప్లాయర్ అవేర్‌నెస్ థీమ్‌తో నిర్వహిస్తున్నామని అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి కాతేరులోని తిరుమల స్కూల్, కోనసీమ జిల్లా-తాళరేవు మండలంలోని సుంకర పాలెంలో ఉన్న రవి జూనియర్ కళాశాల, కాకినాడ జిల్లా-అన్నవరం దేవస్థానం, పశ్చిమ గోదావరి జిల్లా- భీమవరం జగదీశ్ మెరైన్, ఏలూరు జిల్లా- వంగూరులోని గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి రంపచోడవరంలోని లెనోరాలో నిధి ఆప్‌కే నికత్ జరుగుతుందన్నారు. సభ్యులకు ఈసీఆర్, రిటర్నులపై అవగాహన, కేవైసీ, సభ్యుల వివరాలను సరిచేయడం, డిజిటల్ సిగ్నేచర్ వంటి సేవలు ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్య

తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలింపు

కేసు నమోదు

రావులపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్యపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోనసీమ జిల్లా రావులపాలం మండలం గోపాలపురానికి చెందిన మట్టా ఎంజాలీనాజనీఫర్ తామస్ భర్త మట్టా శ్రీనివాస్‌తో నివసిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతీ రోజు తాగి వచ్చి వేధింపులకు గురి చేస్తుండడంతో ఈనెల 25న అర్ధరాత్రి నిద్రిస్తున్న భర్తపై అప్పటికే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలైన శ్రీనివాస్‌ను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమణరెడ్డి తెలిపారు.

స్కూటీ తాళం బద్దలు కొట్టి రూ.1.60 లక్షలు చోరీ

పిఠాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద స్కూటీ డిక్కీ తాళాలు బద్దలు కొట్టి నగదు చోరీ సంఘటన సంచలనం కలిగించింది. పిఠాపురం మండలం గోకివాడ మాజీ సర్పంచ్ బిళ్లకుర్తి రాంబాబు కుమారుడు నాగబాబు సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని బ్యాంకుకు వెళ్లి రూ.1.60 లక్షలు డ్రా చేశాడు. ఆ నగదును స్కూటర్ డిక్కీలో పెట్టి తాళం వేసి పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో తన బంధువు మరణ ధృవీకరణపత్రం కోసం వెళ్లాడు. కార్యాలయం లోపలకు వెళ్లి తిరిగి వచ్చి చూసుకునేసరికి స్కూటీ డిక్కీ తాళాలు బద్దలు కొట్టి తెరిచి ఉండటాన్ని గమనించాడు. లోపల ఉన్న నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని సీసీ కమెరాలు పరిశీలించగా పనిచేయడం లేదని తేలింది. దీంతో బ్యాంకు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ గల సీసీ కెమేరాలను పరిశీలన చేస్తున్నారు. నాగబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

గొల్లప్రోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో వాటర్ ట్యాంకర్ బోల్తాపడింది. పట్టణంలోని జగనన్నకాలనీకి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మంగళవారం కాలనీకి వెళ్లిన ట్యాంకరు అదుపుతప్పి బోల్తాపడింది. ట్యాంకరుపై ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో బోల్తాపడిన ట్యాంకర్‌ను పైకి లేపి తిరిగి యథావిధిగా తాగునీటి సరఫరాను కొనసాగించారు.



గొల్లప్రోలులో బోల్తాపడిన ట్యాంకర్

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

విగ్రహాలు, వ్రత పుస్తకాలు అందజేత

గొల్లప్రోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు వినాయక వ్రతకల్పం పుస్తకాలు, మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

'మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు ప్రభుత్వం అండ'

కాకినాడ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సీఎంగా ఇప్పటివరకు 13 డీఎస్సీలు నిర్వహించి లక్షా 80 వేల 208 పోస్టుల భర్తీ చేశారని, ప్రస్తుతం మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఇచ్చిన హామీ ప్రకారం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించారన్నారు.టీడీపీ అధికారంలో ఉన్న ప్రతీసారి టీచర్ పోస్టుల భర్తీకి క్రమం తప్పకుండా డీఎస్సీ నిర్వహించామన్నారు. సమావేశంలో నాయకులు తూము కుమార్, అనుకుల శ్రీకాంత్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

అభివృద్ధి పనులకు శ్రీకారం

సామర్లకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24వ వార్డు బలుసు వారి వీధిలో కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం ప్రారంభించారు. లారీ స్టాండ్ నుంచి ఫ్లీడర్ తోట వరకు రూ. 24.60లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, గౌరవాధ్యక్షుడు అడబాల కుమారస్వామి, బలుసు వాసు, కంటే జగదీష్ మోహన్, జయలక్ష్మి, అందుగుల జార్జిచక్రవర్తి, గొలితి సత్యనారాయణ, కోటిపల్లి శ్రీను, వల్లూరి దొరబాబు, గుడాల శంకర్, ఉమాశంకర్, జనసేన నాయకులు మంచెం సాయిబాబు, సరోజా వాసు, అల్లిలి కృష్ణ, కందా రమేష్, కాపా వీరబాబు, మున్సిపల్ డీఈ నరసింహారావు, మెప్మా సీవోలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేద వర్గాలకు 'సిద్ధాంతుల' సేవలు ఎనలేనివి

కాకినాడ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దళిత, బలహీన, పేద వర్గాల ప్రజలకు సిద్ధాంతుల ఎనలేని సేవలు అందించారని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కో-ఆర్డినేటర్ తోటి చంగల్‌రావు పేర్కొన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన దళితుల ఆత్మీయ సభలో ఆంధ్ర మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సిద్ధాంతుల కొండబాబును గజమాల, శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర మాల మహానాడు, జై భీమ్‌రావు భారత్ పార్టీ, భీమ్ ఆర్మీ, రెల్లి కుల సంక్షేమ సంఘం, జై భీమ్ మాల మహానాడు, బహుజన ఆర్మీ, దళిత బహుజన ఫ్రంట్ సంఘాలు నేతృత్వాన ఏనుగుపల్లి కృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు భీమ్ ఆర్మీ, అమృతరావు, పిల్లి శివకుమార్, అన్నవరం మధు, ఉల్లం రవి, పోలిపల్లి బాబి వర్ధన్, అదపాక గురునాథ్, ఖండవిల్లి సుబ్బారావు, కనికెళ్ల సూర్యనారాయణ, బడే సత్యనారాయణ, ఇన్నకోటి చంద్రరావు, మహిళా నాయకురాలు బొజ్జ ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.



సిద్ధాంతుల కొండబాబును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఐవో డాక్టర్ సుబ్బరాజు

శిశు మరణాలపై సమీక్ష

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూలై నెలలో జరిగిన శిశు మరణాలపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలు నిండని శిశువు జన్మించుట, తక్కువ బరువుతో బిడ్డ జన్మించుట వంటి కారణాలను గుర్తించామన్నారు. గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూసుకోవడం, ఐరన్, ఫోలిక్‌యాసిడ్ సప్లిమెంట్లను తీసుకోవడం, హైరిస్క్ ప్రెగ్నెన్సీలను ముందుగా గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు అయ్యి, ప్రసవానంతర సేవలు కచ్చితంగా అమలు చేయాలని, 6 హెచ్‌బీఎన్‌సీ గృహ సందర్శనలు తప్పనిసరిగా చేయాలని సూచించారు. సమావేశంలో జీజీహెచ్ పిడియాట్రిక్స్ వైద్య నిపుణుడు డాక్టర్ బుర్రి రాంబాబు, డాక్టర్ జాన్‌విల్సన్, జీజీహెచ్ గైనిక్ వైద్య నిపుణురాలు డాక్టర్ లక్ష్మీకిరణ్, డాక్టర్ స్వాతి, డాక్టర్ కల్యాణ్‌కుమార్, నోడల్ ఆఫీసర్ జెస్సీ ఫ్లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.



భాష్యం స్కూలులో వినాయకుని వేషధారణలో చిన్నారులు

బాల... గణేశులు

పిఠాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాఠశాలల్లో వినాయక చవితి ముందస్తు వేడుకలు జరిగాయి. భాష్యం స్కూలులో చిన్నారులు వినాయకుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. మట్టి విగ్రహాల ప్రాముఖ్యతను వివరిస్తూ ఇంటింటికి వెళ్లి గణనాథుల ప్రతిమలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ ప్రధానోపాధ్యాయురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.





కాకినాడ రూరల్ తూరంగిలో పేద మహిళలకు దుస్తులు అందజేస్తున్న పాస్టర్ దైవసమాధానం, పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మదర్‌కు నివాళి

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి

కాకినాడ రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తూరంగిలోని క్రైస్తవ కమ్యూనిటీ హాల్లో పీస్ సేవా సంఘం వ్యవస్థాపకుడు మండవ దైవసమాధానం ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా 115వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ముఖ్య అతిథులుగా హాజరైన తూరంగి మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, పాస్టర్ రాఘయేలు, పీటీ స్కూల్ డైరెక్టర్ కేజీ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు సుమారు 300 మంది పేదలకు రగ్గులు, చీరలు పంపిణీ చేశారు. బి.నాగేశ్వరరావు, కె.బ్రహ్మస్వామి, మాజీ ఎంపీటీసీ ఆర్.వెంకటేశ్వరరావు, పి.శీనుబాబు, జి.బాబులు, ఎం.మరిడియ్య, సీహెచ్ కొండలరావు, రాంప్రసాద్, దొరబాబు, శంకర్,రాజు, సత్య, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి, బోటనీ అధ్యాపకురాలు డాక్టర్ కె.ఉషశ్రీ, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాల సమస్యలపై ఎస్పీ సమీక్ష

కాకినాడ క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీజీపీ ఆదేశాల మేరకు విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాల సమస్యలపై ఎస్పీ జి.బిందుమాధవ్ మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న డెత్ క్లెయిమ్స్, ఇతర వ్యక్తిగత సమస్యలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మరణించిన లేదా ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బంది, హోంగార్డులకు సంబంధించిన పెన్షనరీ లాభాలు, భద్రతా నిధులు, పోలీస్ జీత ప్యాకేజీ పరిధిలో బీమా కవచం లాంటి అన్ని పెండింగ్ విషయాలను ఈ ఏడాది అక్టోబరు 10వ తేదీలోపు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. 15 బాధిత కుటుంబాలు హాజరై అభ్యంతరాలను వ్యక్తపరిచారు. దీనిపై ఎస్పీ వారికి వివరణ ఇచ్చి అధికారులకు సంబంధిత అంశాలపై తగిన సూచనలు చేశారు. అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ బిందుమాధవ్

ప్రభుత్వ ఆసుపత్రిలో సేవల పరిశీలన

సామర్లకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందుతోందీ లేనిదీ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వయంగా తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రధాన వైద్యురాలు డాక్టర్ అమలతో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఔట్ పేషెంట్లు ఎంతమంది నమోదవుతున్నారు, ఇప్పటివరకు ఎంతమంది నమోదయ్యారో ప్రశ్నించి సమాచారాన్ని రాబట్టారు. ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించేందుకు లాబరేటరీ ద్వారా నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. రక్త, బీపీ, షుగరు వైద్య పరీక్షల అమలుతీరును తెలుసుకుని ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. సామర్లకోట ఏరియా ఆసుపత్రిలో పట్టణ ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించడమే కాక మందులు సైతం ఉచితంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆరోగ్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంగలక్ష్మిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ బాబు

'రైతులకు మేలు చేసేందుకు కృషి చేయాలి'

పెద్దాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయంలో నిర్వీర్యమైన వ్యవసాయ మార్కెట్ కమిటీలను తిరిగి గాడిలో పెట్టేందుకు నూతన పాలకమండలి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) కోరారు. వాలుతిమ్మాపురం రహదారిలోని డి-కన్వెన్షన్ హాలులో బుధవారం జరిగిన మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చైర్‌పర్సన్‌గా నూనే మంగాలక్ష్మి, వైస్ చైర్మన్ మాదిరెడ్డి చంద్రశేఖర్, డైరెక్టర్లు ప్రమాణం చేశారు. బీజేపీ పెద్దాపురం నియోజవకవర్గ ఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణ, లలిత ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్, కూటమి నేతలు





కలెక్టర్, రెడ్‌క్రాస్ చైర్మన్ నుంచి అవార్డులు అందుకుంటున్న పిఠాపురం తహసీల్దారు గోపాలకృష్ణ, సామర్లకోట ఎంపీడీవో హిమ మహేశ్వరి

రెడ్‌క్రాస్‌లో ఉత్తమ సేవలకు పురస్కారాలు

పిఠాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధిత చిన్నారుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో పిఠాపురం మండలానికి జిల్లాలో రెండో స్థానం లభించింది. శిబిర నిర్వహణలో కీలకపాత్ర పోషించిన పిఠాపురం తహసీల్దారు పీవీ గోపాలకృష్ణకు మంగళవారం కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు అవార్డు అందజేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఎంపీడీవో కరక హిమ మహేశ్వరి రెడ్‌క్రాస్‌లో ఉత్తమ సేవలను గుర్తించి కలెక్టర్ షాన్‌మోహన్ ఆమెకు గౌరవ పురస్కారం అందజేశారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె అవార్డు అందుకున్నారు. ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది అభినందించారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కి జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ చిన్నయదొర



కొత్తపల్లి నుంచి కాకినాడ తరలివెళ్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం

సామర్లకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఘన స్వాగతం లభించింది. ఆయన్ను ఆ పార్టీ పెద్దాపురం నియోజకవర్గ నాయకుడు, కాకినాడ జిల్లా కార్యదర్శి డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర సత్కరించి బుద్ధుడి విగ్రహాన్ని అందజేశారు. రాష్ట్ర నాయకులు దుర్గా మోహనరావు, బొలిశెట్టి రామ్‌కుమార్, పోతుల ప్రభాకర్, పెంకే పుష్పలత, పీఎస్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా కాకినాడ విచ్చేసిన పీవీఎన్ మాధవ్‌కు స్వాగతం పలికేందుకు ఆ పార్టీ కొత్తపల్లి మండల కార్యకర్తలు ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. బీజేపీ కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు పంపన శేషగిరి ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు రవణం సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు గండి కొండలరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాసరావు, కొత్తపల్లి మండల సీనియర్ నాయకులు మేడసాని వరలక్ష్మీనారాయణ, కొమ్మిరెడ్డి భద్రరావు కాకినాడ వెళ్లారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కాకినాడ జిల్లా పర్యటన సందర్భంగా ఏలేశ్వరానికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు పైలా బోస్ ఆధ్వర్యంలో బోస్ యూత్ సభ్యులు సుమారు 300 మంది భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. సూర్యకళామందిరంలో జరిగిన సమావేశంలో బోస్‌ను మాధవ్ సన్మానించారు. పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని బోస్‌కు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. బోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొమ్ము నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాకినాడలో ఆయుర్వేద కళాశాల ఏర్పాటుకు చర్యలు

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఆయుర్వేద కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన కాకినాడలో మీడియాతో మాట్లాడుతూ కాకినాడలో ఉన్న మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్మించిన ఆయుష్ ఆసుపత్రికి కొనసాగింపుగా ఆయుర్వేద కళాశాల నిర్మాణానికి కేంద్ర మంత్రికి లేఖ పంపామన్నారు. నేషనల్ ఆయుష్ మిషన్ పథకం కింద నిధులు మంజూరు చేస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారన్నారు. కళాశాల నిర్మాణాలకు రూ.16.40 కోట్లు కావాలని కేంద్రానికి పంపిన ప్రతిపాదనలో పేర్కొన్నామన్నారు.

బార్ లైసెన్స్ దరఖాస్తుల గడువు 29 వరకు పెంపు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బార్ లైసెన్స్ దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 29వ తేదీ వరకు పెంచామని జిల్లా ప్రొహిబిషన్-ఎక్సైజ్ అధికారి కుమారి తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. దరఖాస్తుదారుడు దరఖాస్తుతో పాటు అప్లికేషన్ ఫీజు రూ.5లక్షలు, ప్రొసెసింగ్ ఫీజు రూ.10వేలు ఆన్‌లైన్ ద్వారా గానీ, ఆఫ్‌లైన్ ద్వారా గానీ చెల్లించాలన్నారు. దరఖాస్తును జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. వినాయకచవితి, బ్యాంకు సెలవుల దృష్ట్యా గడువు పొడిగించామన్నారు. ఈ నెల 30వ తేదీన లాటరీ ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు.

ఉచిత ప్రవేశాలకు 1,008 మంది విద్యార్థుల ఎంపిక

కాకినాడ రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాలల విద్యా హక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25శాతం ఉచిత ప్రవేశాలకు మూడవ విడత లాటరీ ఫలితాలను విడుదల చేసినట్టు సమగ్ర శిక్షా ఏపీసీ పి.వేణుగోపాలరావు తెలిపారు. ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు కాకినాడ జిల్లాకు 1,008 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. విద్యార్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 31లోపు సంబంధిత పాఠశాలలకు వెళ్లి తమ ప్రవేశాలను నిర్ధారించుకోవచ్చన్నారు. ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అడ్మిషన్లు ఇవ్వాలని, సరైన కారణం లేకుండా పాఠశాల యాజమాన్యాలు అడ్మిషన్లు నిరాకరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీసీ హెచ్చరించారు.

రొట్టెల పంపిణీ

ఏలేశ్వరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):ఎంపీపీ గొల్లపల్ల బుజ్జి జన్మదిన సందర్భంగా బుజ్జి యువసేన నేతృత్వంలో మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. భవిత కేంద్రంలో విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ నాయకులు సుంకర సత్యనారాయణ, ఎస్వీ అప్పారావు, అప్పికొండ తాతాజీ, కర్రి చంద్రరావు, గొల్లపల్లి పండు, నాగరాజు పాల్గొన్నారు.



జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించండి

● నిర్లక్ష్యం వహిస్తే సహించేంది లేదు: డీసీహెచ్ఎస్ నీలవేణి



ఏరియా ఆసుపత్రిలో విచారిస్తున్న డీసీహెచ్ఎస్ నీలవేణి

రంపచోడవరం,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్యసేవలను అందించేందుకు వైద్యసిబ్బంది చర్యలు చేపట్టాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ నీలవేణి హెచ్చరించారు. ఏరియా ఆసుపత్రిలో సరైన వైద్యసేవలు అందించకపోవడంతో తరచూ మరణాలు చోటుచేసుకుంటున్నాయని రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి సోమవారం పాడేరులో జరిగిన జిల్లా డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ మోనిటరింగ్ సమావేశంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు, గత నెలన్నర కాలంలో ఐ.పోలవరం గ్రామానికి చెందిన కంగల చెల్లాయమ్మ అనే మహిళ గుండెపోటుతో ఏరియా ఆసుపత్రికి వస్తే గంట తర్వాత డాక్టరు వచ్చి ఈసీజీ తీశారని పరిస్థితి విషమంగా ఉందని రాజమహేంద్రవరం రిఫర్ చేశారని, అందుబాటులో ఉన్న స్టెమి ఇంజక్షన్ చేయమని కోరినప్పటికీ కార్డియాలజిస్టు లేరని చేయడానికి కుదరదని చెప్పారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రాజమహేంద్రవరం తీసుకెళ్లిన వెంటనే మృతి చెందినట్లు ఎంపీపీ తెలిపారు. దీంతోపాటు ఇటీవల దామనపల్లికి చెందిన సింధూర అనే గర్భిణీని 20 రోజులపాటు ఏరియా ఆసుపత్రిలో ఉంచుకొని ఆ తర్వాత పరిస్థితి విషమంగా ఉందని గైనకాలజిస్టు రాజమహేంద్రవరం జనరల్ ఆసుత్రికి రిఫర్ చేశారని తల్లీబిడ్డ కూడా చనిపోయారని కలెక్టర్‌కు వివరించారు. నిండు మల్లేశ్వరి అనే నిండు గర్భిణీ ఆసుపత్రిలో చేరగా రాత్రికి రాత్రే రిఫర్ చేయగా 108లో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో సీతపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సహాయంతో 108 సిబ్బంది ప్రసవం చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం డీసీహెచ్ఎస్ నీలవేణి ఏరియా ఆసుపత్రిని సందర్శించి ఎంపీపీ బంధం శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు శేషారెడ్డి సమక్షంలో విచారణ చేపట్టారు. వైద్యులు, స్టాఫ్‌నర్సులు, కిందిస్థాయి సిబ్బందితో సైతం పూర్తిస్థాయిలో విచారణ చేశారు. కొంతమంది వైద్య సిబ్బంది ఫిర్యాదు ఇచ్చినట్లు సమాచారం. దీనిపై మీడియా డీసీహెచ్ఎస్ నీలవేణిని కలిసి వివరణ కోరాగా రోగులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని, డాక్టర్లను, వైద్యసిబ్బందిని మందలించారన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వెంటనే వైద్యం అందజేసి పంపించాలని ఆదేశించడం జరిగిందన్నారు.

డీఎస్సీలో మెరిసిన అనూష



కూనవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):ఆమె నాలుగేళ్ల నిరీక్షణ ఫలించింది. టీచర్ అనూషగా పిలిపించుకోవాలన్న తన చిరకాల కోరిక నెరవేరింది. మారుమూల ప్రాంతమైన కూనవరంలో జన్మించిన కొయ్యల అనూష డీఎస్సీలో 78/100 మార్కులతో జిల్లా స్థాయిలో ఎస్‌జీటీ విభాగంలో 464వ ర్యాంకు సాధించి తన సత్తా చాటింది. తండ్రి వీఆర్వోగా పనిచేస్తూ అనూష చిన్నప్పుడే చనిపోయాడు తల్లి నాగమణి కూనవరం పంచాయతీ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తుంది. అనూష 2014, 2019లో టీడీపీ తరఫున ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందింది. తర్వాత అనూష సచివాలయంలో పంచాయతీ సెక్రటరీగా పనిచేసింది. ఆ ఉద్యోగం తనకు నచ్చకపోవడంతో రాజీనామా చేసింది. 2021 నుంచి ఇంటి దగ్గరే ఉంటూ తనకిష్టమైన ఉపాధ్యాయ వృత్తి కోసం చదువుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ ప్రకటించడంతో ఈ పరీక్షల్లో పాల్గొని ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. తన తల్లి నాగమణి భర్త బాలకృష్ణ సహకారంతో తాను ఈ పోస్ట్ సాధించగలిగానని అనూష చెబుతోంది.

మండలంలో తనిఖీలు చేపట్టిన ఐటీడీఏ పీవో



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో

రాజవొమ్మంగి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులతో పీవో అన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు పాఠాలు చెప్పాలని పీవో కట్టా సింహాచలం అన్నారు. అనంతరం మండలంలో ఉన్న ఫెర్టిలైజర్స్ షాపులను పీవో తనిఖీ చేశారు. రాజవొమ్మంగి గ్రోమోర్ కేంద్రం వద్ద తనిఖీ చేసిన పీవో, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, లేకపోతే చర్యలు చేపడతామని హెచ్చరించారు.

నవరాత్రి ఉత్సవాలకు మండపాలు ముస్తాబు

వీఆర్‌పురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాలకు మండపాలను ఆయా ఆలయ ఉత్సవకమిటీ సభ్యులు అందంగా ముస్తాబు చేశారు. మండల కేంద్రమైన వీఆర్‌పురంలోని వివిధ ప్రధాన కూడళ్లతో పాటుగా, మండలంలోని వడ్డిగూడెం, రాజుపేట, రేఖపల్లి, సీతంపేట, శ్రీరామగిరి, రేఖపల్లి ఎస్‌సీకాలనీ, రేఖపల్లి గొల్లగూడెం, అన్నవరం, చింతరేవుపల్లి తదితర గ్రామాలలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

దేవీపట్నం(ఆంధ్రజ్యోతి):నేడు వినాయక చవితి సందర్భంగా నిర్వహించే నవరాత్రి ఉత్సవాలకు మండల గ్రామాల్లో కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే గ్రామ వీధుల్లో పందిళ్లు వేసి, మామిడి తోరణాలు కట్టి, విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు.

తీరుమారని రంపచోడవరం ఐటీడీఏ

● గిరిజన కళలను విస్మరించారంటూ ఆదివాసీ, గిరిజన సంఘాల ఆరోపణ

రంపచోడవరం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సాంప్రదాయ కళలను వెలికి తీసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న ఆదికర్మ అభియాన్ పథకం కింద నిధులను దుర్వినియోగపర్చడమే లక్ష్యంగా రంపచోడవరం ఐటీడీఏ అధికారులు వ్యవహరిస్తున్నా రంటూ పలు ఆదివాసీ, గిరిజన సంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు ఈ సంఘాల నాయకులు వెదుళ్ల లచ్చిరెడ్డి, లోతారామారావులు వేర్వేరు ప్రకటనలను విడుదల చేశారు. రంపచోడవరం ఐటీడీఏ గిరిజన ప్రాధాన్యతలను విస్మరించి ఇష్టానుసారం వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. ఆదివాసీల సాంప్రదాయ కళలను ప్రోత్సహించాల్సిన ఐటీడీఏ కేవలం ప్రాశ్చాత్య కళలను ప్రోత్సహిస్తూ ఆదివాసీలను అవమానిస్తోందని వారు పేర్కొన్నారు. రికార్డింగ్ డ్యాన్సుల మాదిరిగా అధికారులే కార్యక్రమాలను నిర్వహించడం ప్రభుత్వ లక్ష్యాలను నీరుగార్చడమేనని వారు పేర్కొన్నారు. ఆదివాసీలు సామాజిక కార్యక్రమాలకు కనీసం ప్రోత్సహించకుండా, ఆదివాసీల కార్యక్రమాలకు విలువ ఇవ్వకుండా ప్రభుత్వ కార్యక్రమాలను తమ సొంత కార్యక్రమాలుగా నిర్వహిస్తూ ఆదివాసీలను అవమానిస్తున్నారంటూ ఆదివాసీ నాయకులు ఐటీడీఏ అధికారులపై మండిపడుతున్నారు. అధికారుల ఇటువంటి తీరుపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయడమే కాకుండా నిరసనలు, ఆందోళనలు చేపడతామని వారు పేర్కొన్నారు.

వైసీపీ పాలనలో పోలవరం నిర్వాసితులకు అన్యాయం

కూనవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):గత వైసీపీ ప్రభుత్వంలో ముంపు మండలాల్లోని పోలవరం నిర్వాసితులకు అన్యాయం జరిగిందని కూటమి నాయకులు వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు చలకాని ఉమామహేశ్వరరావు అన్నారు కూనవరం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఎమ్మెల్యే శిరిషదేవి వరద బాధితులను పట్టించుకోవడంలేదని తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మిపై విమర్శలు విడ్డూరంగా

వీఆర్‌పురం, అగస్టు 26 (ఆంధ్రజ్యోతి) రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిపై మండల కూటమి నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వైసీపీ మండల అధ్యక్షుడు మాదిరెడ్డి సత్తిబాబు, మండల నాయకుడు చిక్కాల బాలు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు మాజర్ల గంగులు అన్నారు.

స్మార్ట్‌కార్డులతో పారదర్శకంగా రేషన్ పంపిణీ

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



స్మార్ట్‌కార్డును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ పంపిణీ మరింత పారదర్శకంగా, జవాబుదారీ తనంగా నిర్వహించాలని లక్ష్యంతో పాత కార్డులు స్థానంలో క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. వెదురుపాక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దాసరి సింగరమ్మ అధ్యక్షతన కొత్త రేషన్‌కార్డు పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. రేషన్ సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం స్మార్ట్‌కార్డు సిస్టం ఏర్పాటు చేసిందని, ప్రతి ఒక్కరూ రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు పిల్ల చం టిబాబు, సూరంపాలెం ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ ఉంగరాల రాము, గోకవరం సొసైటీ ఛైర్మన్ గాజింగం సత్తిబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యనమలకు మట్టి వినాయక ప్రతిమ బహూకరణ



తునిరూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యాసంస్థల విద్యార్థులు స్వయంగా తయారుచేసిన మట్టి వినాయకుని ప్రతిమను మంగళవారం మాజీ మంత్రి యనమల రామకృష్ణుడికి అందజేశారు. తేటగుంట క్యాంప్ కార్యాలయంలో ఆఫీస్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు యనమలను కలిశారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల కృషిని యనమల అభినందించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యినుగంటి సత్యనారాయణపాల్గొన్నారు.

చవితి పత్రి పంపిణీ

జగ్గంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా పాలిక రమణ మంగళవారం పట్టణంలో వివిధ రకాల పత్రులు సేకరించి వినాయక మండపాలకు, ప్రతి ఇంట్లో చేసుకుంటున్న పండుగకు ఉచితంగా పత్రి అందజేశారు.

మట్టి వినాయకుల తయారీపై పోటీలు

తొండంగి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హిత మట్టి వినాయకుల తయారీపై పెరుమాళ్ళాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం పోటీలు నిర్వహించారు. ఎటువంటి రంగులు వినియోగించకుండా వివిధఆకృతుల్లో విద్యార్థులు వినాయక విగ్రహాలను తయారు చేశారు. హెచ్ఎం చాట్రాతి సత్యన్నారాయణ, విద్యాకమిటీ ఛైర్మన్ బద్ది రాంబాబు, ఎకో క్లబ్ టీచర్ శ్రీదేవి విగ్రహాలను పరిశీలించి విజేతలకు బహుమతులు అందించారు.

గణేష్ ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి

గండేపల్లి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): గణపతినవరాత్రులు సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని గండేపల్లి ఎస్ఐ యూవీ శివ నాగబాబు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం ద్వారా గణపతి ఉత్సవాలకు అనుమతి పొందాలన్నారు. ప్రశాంత వాతావరణంలో శాంతిభద్రతలకు ఇబ్బంది కలగకుండా ఉత్సవాలు చేసుకోవాలన్నారు. నిమజ్జనాల సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. తుమ్మలపల్లి రమేష్ హాజరై 500మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే ఉద్యోగాల భర్తీ: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ శిక్షణ పొందిన 16,347మంది నిరుద్యోగ టీచర్లకు కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించి యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. పెదశంకర్లపూడిలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతను ఘోరంగా మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని సరైన మార్గంలో నడిపిస్తుందని, విద్యారంగ అభివృద్ధిలో మంత్రి నారా లోకేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులకు వయస్సు మినహాయింపు కల్పించి వారికి ప్రభు త్వం అండగా నిలిచిందన్నారు. 14ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పాలనలో 13డీఎస్సీల ద్వారా 1,80,208 ఉపాధ్యాయ నియామకాలు జరిపారని, నేడు రాష్ట్రంలో పనిచేస్తోన్న ఉపాధ్యాయుల్లో ఎక్కువ మంది చంద్రబాబు పాలనలో ఉద్యోగాలు పొందిన వారేనని, ఈక్రమంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు.

సోమవారంలో ‘నా పట్టు- నా అభిమానం’



పట్టు పురుగుల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం గ్రామంలో జ్యోతుల ప్రభ షెడ్ వద్ద నా పట్టు- నా అభిమానం అనే కార్యక్రమం సీఎస్‌బీ సైంటిస్ట్ ఈ.భువనేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి టి.రాజేంద్రప్రసాద్ బాబు మాట్లాడుతూ పట్టు పండించడంతో రియరింగ్ షెడ్‌ను శుభ్రపరచడం చాలా ముఖ్యమన్నారు. భువనేశ్వరి మాట్లాడుతూ రేరింగ్ గదిని మంచినీటితో శుభ్రం చేయకూడదని ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన డిస్ ఇన్ఫెక్ట్‌తో మాత్రమే శుభ్రం చేయాలన్నారు. 40మంది పట్టు రైతులు శిక్షణ పొందారు. చేబ్రోలు టీఎస్సీ అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ కె.సత్యనారాయణ, పెద్దాపురం టెక్నికల్ ఆఫీసర్ డివి రమణ, టెక్నికల్ అసిస్టెంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో వర్షం

ప్రత్తిపాడు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో భారీ వర్షం కురిసింది. వేకువజాము నుంచే వర్షం ప్రారంభమై రాత్రి వరకు చిరుజల్లులతో వర్షం పడింది. అల్లూరి సెంటర్, చెక్‌పోస్టు సెంటర్ పల్లపు ప్రాంతాలు చిన్నపాటి చెరువుల్లా మారాయి.



అన్నసమారాధన

జగ్గంపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని జగ్గంపేటలో కాకినాడ రోడ్‌లో ఉన్న కృష్ణుడి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నదానం నిర్వహించారు. శ్రీకృష్ణ యాదవ్ సంఘం అధ్యక్షుడు మొరుకుర్తి రాజు, గౌరవాధ్యక్షుడు వైబోగుల కొండబాబు యాదవ్, వైస్ ప్రెసిడెంట్ సారిపల్లి బుచ్చిరాజు, లోడగల రాంబాబు. కంచి బోయిన గోపి పాల్గొన్నారు.

గంజాయి అమ్మకంతో కొన్న ఆస్తి సీజ్

గండేపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అమ్మి వచ్చిన సొమ్ముతో కొన్న ఆస్తిని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి జగ్గంపేట సీఐ వైఆర్ కే.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వనపర్తి బాపిరాజు అనే వ్యక్తి ఇతరుల నుంచి గంజాయిని కొని వ్యాపారం చేస్తుండడంపై పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. రవాణా ద్వారా బాపిరాజు సంపాదించిన డబ్బుతో గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో 0.84 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడన్నారు. అతడిపై కేసు నమోదు కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతడు కొన్న భూమిని మంగళవారం సీజ్ చేశామని వివరించారు.

కోడిపందాలపై దాడి..ముగ్గురి అరెస్టు

శంఖవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నెల్లిపూడి శివార్లలో కోడి పందాల శిబిరంపై సోమవారం అర్ధరాత్రి అన్నవరం పోలీసులు దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో 15 మోటారు సైకిళ్ళు, 3 కోళ్లు, రూ.2650 నగదు, రెండు కత్తులను సీజ్ చేసామని అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు.

యూరియా కొరతపై రైతుల ఆందోళన

ఆలస్యంగా యూరియా పంపిణీకి ఏర్పాట్లు

ప్రత్తిపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో యూరియా కోసం రైతులు ఆందోళన చేపట్టారు. పశువుల ఆసుపత్రి సెంటర్ వద్ద ఉన్న రైతు భరోసా కేంద్రం వద్ద ఉదయం 8 నుంచే యూరియా కోసం బారులు తీరిన రైతులు 10.30 గంటల వరకు యూరియా పంపిణీ చేపట్టకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల వ్యవసాయాధికారి జోకా అమృత 11గంటలకు యూరియా పంపిణీకి చర్యలు చేపట్టారు. 278 మంది రైతులకు 20 టన్నుల యూరియాను ఏవో పంపిణీ చేశారు. దీనిపై స్థానిక రైతు సంఘ ప్రతినిధులు సానా నూకరాజు నాయుడు, జువ్వల బాబు మాట్లాడుతూ రైతులకు పూర్తిస్థాయిలో యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

రుణపడి ఉంటా : మాజీ మంత్రి ముద్రగడ

కిర్లంపూడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో తన వెన్నంటి నిలిచిన అందరికీ రుణపడి ఉంటానని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన లేఖ విడుదల చేశారు. తన ఆరోగ్యం బాగోలేదని తెలిసిన వెంటనే మాజీ సీఎం జగన్ స్పందించి ఎప్పటికప్పుడు క్షేమ సమాచారాలు తెలుసుకున్నారన్నారు. ఇతర ప్రజా ప్రతినిధులు పార్టీలకతీతంగా తనకు అండగా నిలిచారన్నారు.



ఒమ్మంగిలో బాధితుడికి సహాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ఆర్థికసాయం అందజేత

ప్రత్తిపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఒమ్మంగిలో గంటా బాబురావు అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతుండగా ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ముమ్మిడి చక్రరావుకు బ్రెయిన్ ఆపరేషన్ జరగడంతో పరామర్శించారు. ప్రత్తిపాడు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకుని కోలుకుంటున్న యాళ్ల సుభద్రకు రూ.10వేలు సహాయం అందించారు.



ప్రత్తిపాడు మినర్వాలో గణపతి పూజ చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడులో చవితి పూజలు

ప్రత్తిపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మినర్వా విద్యా సంస్థల ప్రాంగణంలో మంగళవారం వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. మట్టితో చేసిన గణపతి విగ్రహాల ప్రదర్శన నిర్వహించి సామూహిక గణపతి పూజల్లో పాల్గొన్నారు. మాస్టార్ అనిరుద్ వినాయక చవితి ఆవశ్యకతను వారికి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేశ్వరి, ఇన్‌చార్జ్ లక్ష్మణకుమార్, రాజుకుమార్ రవి తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల పంపిణీ

గండేపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ, జాతీయ సేవా పథకం, రోట్రాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ రహిత గణేశ్ విగ్రహాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వయంగా 250 విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేశారు.



మాధవ్‌ను అభినందిస్తున్న ప్రత్తిపాడు బీసీ నాయకులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ప్రత్తిపాడు నాయకులు

ప్రత్తిపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను నియోజకవర్గ బీసీ నాయకులు కలిసి అభినందించారు. మంగళవారం కాకినాడ విచ్చేసిన ఆయన్ను బీసీ నాయకులు కోళ్ల రవి తదితరులు కలిసి సన్మానించి అభినందించారు.

తహశీల్దార్, ఎంపీడీవోలకు రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డు

ప్రత్తిపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డు లభించాయి. మంగళవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ షగిలి ఈ అవార్డులను అందజేశారు. ఇటీవల ప్రత్తిపాడులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో భారీ ఎత్తున దాతలు పాల్గొనేందుకు కృషి చేసినందుకు ఈ అవార్డులను అందజేశారు.

ఆహార పొట్లాల పంపిణీ

ప్రత్తిపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బీసీవై పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొంప శివకుమార్ మంగళవారం ప్రత్తిపాడు పాదాలమ్మ గుడి వద్ద గల వృద్ధ శరణాలయంలో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. దివిలి శాంతివర్ధిని పాఠశాలలో అన్నదానం నిర్వహించారు.

‘ఆదిత్య’లో ముగిసిన ఏఐపై శిక్షణ

గండేపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలోని ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, ఏఐఎంఎల్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఏఐ సాధనాలు విద్య, పరిశోధనపై శిక్షణ కార్యక్రమం ముగిసిందని డిప్యూటీ ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

శంఖవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పెదమల్లాపురంలో గిరిజనులు, గిరిజనేతరులకు కత్తిపూడి రిఫరల్ ఆసుపత్రి, గిరిజన నేతల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ఉచితంగా వైద్యశిబిరం నిర్వహించడంతో భారీగా గిరిజనులు హాజరయ్యారు. 250మందికి వైద్యపరీక్షలు చేసినట్టు వైద్యులు తెలిపారు. సర్పంచ్ గుండు నాగదేవి, మాజీ సర్పంచ్ పసగడుగుల నాగేశ్వరరావు, గుండు చెంచుబాబు, ఆది వాసీ నాయకులు జర్తా ముసలయ్య, జర్తా వెంకటరమణ, బత్తిన పోతురాజు పాల్గొన్నారు.

మణిబాబుకు సత్కారం

జగ్గంపేట,ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడు జీను మణిబాబును పలువురు సత్కరించి అభినందించారు. జేవీఆర్ అపార్టుమెంట్‌లో గొల్లలగుంట మాజీ ఎంపీటీసీ రాయుడు గోవిందు, గ్రామటీడీపీ అధ్యక్షులు చింతాకుల ఈశ్వరరావు, గ్రామ బీసీనాయకులు ఆధ్వర్యంలో సత్కరించారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట శెట్టిబలిజ గీత కార్మికులు మణిబాబును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆధ్యాత్మిక విషయాలు అలవర్చుకోవాలి

అన్నవరం,ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు ఆధ్యాత్మిక విషయాలను అలవరుచుకోవాలని ఎంఈవో ఎస్వీ. రమణ పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో సత్యసాయి విద్యావిహార్ పాఠశాలలో విద్యార్థుల మౌలిక వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యం తరుపున విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.కరస్పాండెంట్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

బెండపూడి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మృతి



తొండంగి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బెండపూడికోట వీధి ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పురాణం కుమారస్వామి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. అద్దరిపేట ఉన్నత పాఠశాలలో గణిత స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఆయన బెండపూడి పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయునిగా ఇటీవల చేరారు. ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిసెట్టి సుబ్బిరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు